ములకలచెరువు విద్యార్థికి అరుదైన అవకాశం

● అంతర్జాతీయ స్థాయి నెట్‌వర్కింగ్‌పై దుబాయ్‌లో ప్రజెంటేషన్

● హాజరైన పలు దేశాల ప్రతినిధులు ● ఐఈఈఈ సొసైటీ నుంచి ప్రశంసలు



దుబాయ్‌లో జరిగిన సెమినార్‌లో నెట్ వర్కింగ్‌పై వివరిస్తున్న మోక్షిత్

ములకలచెరువు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం అంగళ్లలోని మిట్స్ కళాశాలలో చదువుతున్న ములకలచెరువు విద్యార్థికి అరుదైన అవకాశం దక్కింది. దుబాయ్‌లో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన సమ్మిట్‌లో నెట్ వర్కింగ్‌పై ప్రజెంటేషన్ ఇచ్చాడు. ఐఈఈఈ కమ్యూనికేషన్ స్టూడెంట్ టెక్ లీడర్ షిప్ కాన్ఫరెన్స్ ప్రతినిధుల నుంచి ప్రశంసాపత్రం, సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. ఈ సమ్మిట్‌కు పలు దేశాల ప్రతినిధులు, విద్యార్థులు హాజరయ్యారు. ములకలచెరువు వినాయకనగర్‌కు చెందిన బత్తుల శ్రీనివాసులు కుమారుడు బత్తుల మోక్షిత్ అంగళ్లలోని మిట్స్ కళాశాలలో బీ టెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 16వ తేదీ ఐఈఈఈ కమ్యూనికేషన్ స్టూడెంట్ టెక్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్ అధ్వర్యంలో దుబాయ్ ర్యాపిల్ హోటల్‌లో జరిగిన సమ్మిట్‌లో నెట్‌వర్కింగ్, 2జీ, 4జీ, 5జీ, 6జీ వల్ల ప్రయోజనాల గురించి వివరించారు. ఈ సమ్మిట్ ప్రజెంటేషన్‌కు మన దేశం నుంచి మొత్తం 20 మంది హాజరు కాగా ఇందులో ములకలచెరువు విద్యార్థికి అవకాశం దక్కింది. సమ్మిట్‌కు గ్రీస్, బెహరైన్, పాకిస్థాన్ తదితర దేశాలకు చెందిన విద్యార్థులు, ప్రతినిధులు హాజరయ్యారు. అక్కడ బత్తుల మోక్షిత్ ఇచ్చిన ప్రజెంటేషన్‌కు కాన్ఫరెన్స్ ప్రతినిధుల నుంచి ప్రశంసలు అందుకున్నాడు. అలాగే ప్రతినిధులు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ క్రమంలో ఆదివారం దుబాయ్ నుంచి విద్యార్థి తిరిగి వచ్చాడు. ఈ సందర్భంగా మోక్షిత్ మాట్లాడుతూ తనకు దుబాయ్‌లో నెట్‌వర్కింగ్‌పై ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్, హెచ్‌వోడీ డాక్టర్ రాజశేఖరన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

సబ్ కలెక్టరేట్ వద్ద నేలకూలిన భారీ వృక్షం

● తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న వృద్ధుడు

మదనపల్లె టౌన్, అక్టోబరు 20: మదనపల్లె సబ్‌కలెక్టరేట్ ఆవరణంలోని భారీ చింత చెట్టు ఆదివారం ఉదయం ఉన్నట్టుండి నేలకూలింది. సబ్‌కలెక్టరేట్ ప్రహరీ పక్కనే ఉన్న ఈ చింత చెట్టు జాతీయ రహదారిపై నేల కూలింది. అదే సమయంలో లచ్చారెడ్డి వీధికి చెందిన చంద్రశేఖర్ ఆచారి (72) సైకిల్‌పై చిత్తూరు బస్టాండుకు వస్తుండగా చింతచెట్టు కొమ్మలు మీద పడటంతో చంద్రశేఖర్ గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాలతో టీడీపీ నాయకులు హరిబాబు, చంద్రశేఖర్, మల్లికార్జున అక్కడికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. భారీ వృక్షం జాతీయ రహదారికి అడ్డంగా పడిపోవడంతో చిత్తూరు నుంచి వచ్చే వాహనాలను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించారు. దీంతో పాటు మూడేళ్ల క్రితం నిర్మించిన సబ్‌కలెక్టరేట్ మెయిన్ గేటు ప్రహరీ, కార్యాలయ బోర్డు, విద్యుత్ దీపాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. సుమారు రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లి ఉంటుందని స్థానికులు చెప్పారు. వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా, ట్రాఫిక్ ఎస్ఐ సుబ్రమణ్యం, అటవీశాఖ ఎఫ్‌బీవో త్యాగరాజు అక్కడికి చేరుకుని చింతచెట్టు కొమ్మలను కూలీల చేత నరికించి ట్రాఫిక్ క్లియర్ చేయించారు. కాగా ఈ ప్రమాదంలో గాయపడిన చంద్రశేఖర్‌కు స్థానిక ప్రభుత్వాస్పత్రికి ఆటోలో తరలించి చికిత్సలు అందిస్తున్నారు.



చెట్టుకూలి గాయపడిన చంద్రశేఖర్



సబ్ కలెక్టరేట్ ఎదుట జాతీయ రహదారిపై అడ్డంగా కూలిన చింత చెట్టు

సలాం పోలీస్



ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

● నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

● నేటి నుంచి 31 వరకూ జిల్లాలో పోలీసు వారోత్సవాలు

● నేడు కలికిరి సీఆర్పీఎఫ్‌లో సద్భావనా దివస్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు



కలికిరి సీఆర్పీఎఫ్ సింహద్వారం

అది 1959 అక్టోబరు 21వ తేదీ. భారత్ చైనా సరిహద్దులోని అత్యంత ప్రమాదకరమైన లద్దాక్ దగ్గర 'హాట్ స్ప్రింగ్స్' ప్రాంతం. సరిహద్దులో గస్తీ కాస్తున్న క్రౌన్ రెప్రజెంటెటివ్స్ పోలీస్ (సీఆర్పీ) దళంలోని సైనిక జవాన్లకు ఎస్ఐ సర్దార్ కరమ్ సింగ్ నాయకత్వం వహిస్తున్నాడు. అప్పటికే చైనా దళాల నుంచి ప్రమాదం పొంచి ఉందనే సమాచారంతో కరమ్‌సింగ్‌తో సహా జవాన్లంతా అప్రమత్తంగా ఉన్నారు. అనుమానిస్తున్నట్టే అత్యంత ఆధునిక ఆయుధాలతో చైనా దళాలు విరుచుకుపడ్డాయి. భారత సీఆర్పీ బృందంలోని 10 మంది జవాన్లు ఆత్మస్థైర్యంతో చైనా సైనికులను ఎదురిస్తూ చివరి రక్తం బొట్టు వరకు పోరాడి దేశం కోసం అసువులు బాశారు. ఈ నేపథ్యంలోనే ఇండియన్ మిలటరీకి పటిష్టం కావడంతో పాటు బీఎస్ఎఫ్ (సరిహద్దు భద్రతా దళం), ఐటీబీపీ (ఇండో టిబెట్ బార్డర్ పోలీస్) ఇలా విస్తరించింది. ఇక దేశంలో కూడా అంతరంగిక భద్రతకు ఉగ్రవాదం, వేర్పాటువాదం, నక్సలిజం వంటి అనేక సవాళ్ల మొదలవడంతో ఆ దిశగా దేశ ఆంతరంగిక భద్రతా బలగాలను పటిష్టం చేసేందుకు సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ వంటి పారా మిలిటరీ ఫోర్స్‌ను మిలటరీ రక్షణ దళాలకు సమాంతరంగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా అమరవీరులను గుర్తుంచుకుని స్మరించుకునేందుకు ఒక ప్రత్యేక తేదీని నిర్ణయించాలని 1962లో దేశంలోని అన్ని రాష్ట్రాల హోంమంత్రులు, డీజీపీలు, ఐజీలు సమావేశమై ప్రతి సంవత్సరం అక్టోబరు 21వ తేదీ పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పాటించాలని నిర్ణయించారు. అప్పటి నుంచి సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ వంటి పారా మిలిటరీలతో పాటు ఆయా రాష్ట్రాల పోలీసులు కూడా సంస్మరణ దినంగా పాటించడం మొదలైంది. అందుకే దీనికి పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా నామకరణం చేశారు. కలికిరిలో ఉన్న సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ బెటాలియన్లతో పాటు జిల్లా పోలీసులు ఈనెల 31వ తేదీ వరకూ నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం.

వివరాలు 6 లో..



అమరవీరులకు ఎంత చేసినా తక్కువే..



దేశంలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాపాడటం ఇప్పుడు పెను సవాలుగా మారింది. వేర్పాటు, ఉగ్రవాదాలు, నక్సలిజం, మతోన్మాదం వంటివన్నీ జడలు విప్పి భారత సౌభ్రాతృత్వం మీద ముప్పేట దాడులు జరుపుతున్నాయి. అయినా ఎన్నో వ్యక్తిగత కష్టనష్టాలకోర్చి ఈ ఉన్మాదాల నిర్మూలనను సీఆర్పీఎఫ్ భుజాల కెత్తుకుంది. అకుంఠిత దీక్షా దక్షతలతో పోరాడుతూ ప్రజలను కంటికి రెప్పలా కాపాడటమే లక్ష్యం. లక్ష్య సాధన కోసం ఎంత వరకైనా ముందుకెళతాం. పోరాటంలో జవాన్లు అలసిపోకుండా ఉండటానికి ప్రజల నైతిక మద్దతు చాలు. అమరులైన వారి కోసం ఒక కన్నీటి చుక్క రాల్చితే అదే పది వేలు. మరింత స్ఫూర్తిదాయకంగా ముందుకెళతాము. ప్రజల భద్రత, ప్రజావిధేయతే మా లక్ష్యం, ధ్యేయం. అమరవీరుల కుటుంబాలే మాకు సదా వెన్నంటి నిలిచే సంకల్ప బలం. ఈ సందర్భంగా వికసిత్ భారత్ కోసం అందరం చేతులు కలిపి మరింత స్ఫూర్తి నింపుదాం.

- అనుపమ్ శర్మ, డీఐజీ, సీఐఏటీ-3, సీఆర్పీఎఫ్, కలికిరి

16 గంటలు నరకం అనుభవించి

మృత్యుఒడిలోకి బాలిక

● దిగ్ర్భాంతికి గురైన తల్లిదండ్రులు, బంధువులు

● అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

బద్వేలుటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గోపవరం సెంచురీ ఫ్లైవుడ్ వద్ద శనివారం జరిగిన అమానవీయ ఘటనలో మైనర్ బాలి క 16 గంటలు నరకం అనుభవించి మృత్యు ఒడికి చేరింది. దీంతో తల్లిదండ్రులు, బంధువులు దిగ్ర్భాంతికి గురయ్యారు. ఆదివారం సాయంత్రం కడప రిమ్స్ ఆసుపత్రి నుంచి ప్రత్యే క వాహనంలో బద్వేలు పట్టణంలోని స్వగృహా నికి మృతదేహం చేరడంతో రోధనలు మిన్నం టాయి. కడసారి చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు, బంధువులు అధికసంఖ్యలో తరలివ చ్చి బాలికకు జరిగిన అన్యాయాన్ని తలుచు కుంటూ కన్నీరుమున్నీరయ్యారు. కాగా సాయంత్రం అశ్రునయనాల మధ్య బాలిక అంత్యక్రియలు జరిగాయి. బద్వేలు పట్టణంలో నివాసం ఉం టున్న దంపతులకు ఒక కుమారుడు, కుమా ర్తె ఉన్నారు. తల్లిదండ్రులు కూలిపనులు చేసు కుంటూ బిడ్డలను అల్లారు ముద్దుగా పెంచారు. మంచి చదువులు చదివించి, ప్రయోజకు లను చేయాలనుకున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాగా తన కుమార్తె ను బెదిరించి, అడవిలోకి తీసుకువెళ్లి నిప్పం టించి హత్యచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, అప్పుడే తన కుమార్తె ఆత్మశాంతి స్తుందని తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ తీరు చూసిన పలువురిని కంటతడి పెట్టించాయి. కాగా మైనర్ బాలిక సంఘటన విషాదకరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షు రాలు విజయజ్యోతి పేర్కొన్నారు. సమాజంలో ని మానవమృగాలను కూకటివేళ్లతో పెకిలిం చాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిం చడంతో పాటు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పెళ్లి చేసుకోమన్నందుకే పథకం ప్రకారం హత్య

● 24 గంటల్లో నిందితుడిని పట్టుకున్నాం ● కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోవాలని కోరడంతో పథకం ప్రకారమే నిందితుడు విఘ్నేశ్ బాలికను పిలిపించి ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించి దారుణంగా హత్య చేశాడని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం సాయంత్రం ఆయన మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

బద్వేలు పట్టణంలో విఘ్నేశ్ ఉండేవాడు. వారి ఇంటి సమీపంలో బాలిక కుటుంబసభ్యులు కూడా ఉండేవారు. విఘ్నేశ్‌కు ఐదేళ్లుగా బాలికతో పరిచయం ఉండేది. కాగా విఘ్నేశ్ ఆరు నెలల క్రితం మరో యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. శుక్రవారం రాత్రి మైనరు బాలికకు ఫోను చేసి 'నిన్ను కలవాలని, నువ్వు రాకపోతే నేను సూసైడ్ చేసుకుంటా'నంటూ ఫోనులో చెప్పడంతో ఆ బాలిక శనివారం బద్వేలు టౌనుకు వచ్చింది. ముందే పథకం వన్నిన విఘ్నేశ్ ఒక బాటిల్‌లో అరలీటరు పెట్రోలు పట్టుకుని తన బండి బ్యాగులో పెట్టుకుని బద్వేలుకు వచ్చాడు. బాలికను పీపీకుంట అడవి సమీప ప్రాంతంలో రహస్యంగా కలుసుకోవాలని చెప్పడంతో ఇరువురు సెంచురీ ఫ్యాక్టరీ సమీపానికి వెళ్లారు. అక్కడి నుంచి సమీపంలోని అడవుల్లోకి ఆ బాలికను తీసుకెళ్లాడు. తరువాత బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. తనను కూడా పెళ్లిచేసుకోవాలంటూ బాలిక విఘ్నేశ్‌ను కోరడంతో ముందుగానే పథకం ప్రకారం యువకుడు ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బద్వేలు పోలీసులు అక్కడికి చేరుకొని 80 శాతం తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం బద్వేలు ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అయితే అర్ధరాత్రి 2.30 గంటలకు చికిత్స పొందుతూ బాలిక మృతి చెందినట్లు తెలిపారు. మూడు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారని ఆదివారం మధ్యాహ్నం కడప డీటీసీ వద్ద నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమని ఎస్పీ తెలిపారు. నిందితుడిని 24 గంటల్లోనే అరెస్టు చేయడంలో తమ సిబ్బంది బాగా పనిచేశారని, ఫోరెన్సిక్, క్లూస్‌టీం పూర్తి స్థాయిలో పరిశీలించారన్నారు. నిందితుడు ఉపయోగించిన బాటిల్, లైటరు స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా ఆదివారం ఉదయం బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. బాలిక బంధువులు పెద్దఎత్తున మార్చురీ వద్దకు చేరుకున్నారు. తమ కుమార్తెను దారుణంగా హత్య చేసిన నిందితుడిని ఉరి శిక్ష వేయాలంటూ బోరున విలపించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ దూదేకుల సంఘం నాయకులు రిమ్స్ వద్ద డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం, ఎస్ఐలు పాల్గొన్నారు.



బాలిక మృతిపై సీఎం చంద్రబాబు విచారం

● ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గోపవరంలో బాలికపై పెట్రోలు పోసి నిప్పంటించిన సంఘటనలో విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడంతో సీఎం చంద్రబాబునాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థిని ఒక దుర్మార్గుడి దుశ్చర్యకు బలి కావడంపై తీవ్ర ఆవేదన చెందారు. ఘటనపై పోలీసు అధికారులతో సీఎం ఎప్పటికప్పుడు ఆరాతీశారు. నిందితున్ని అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. వేగంగా విచారణ పూర్తి చేసి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని సీఎం ఆదేశించారు.

బాలిక కుటుంబానికి న్యాయం చేయడమంటే హంతకున్ని త్వరగా చట్టబద్ధంగా శిక్షించడమేనని సీఎం తెలిపారు. ప్రత్యేక కోర్టులో ఫాస్ట్ ట్రాక్ విధానంలో ఈ కేసు విచారణ పూర్తి చేసి నిందితుడికి శిక్ష పడేలా చూడాలన్నారు. మహిళలు, ఆడబిడ్డలపై అఘాయిత్యాలు చేసే వారికి ఈ ఘటనలో పడే శిక్ష ఒక హెచ్చరికగా ఉండాలని అధికారులకు సీఎం సూచించారు.

రైల్వేకోడూరులో మట్టి మాఫియా

● ఖద్దరు అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు

● అధికారుల అనుమతి లేకుండా మట్టి తరలింపు

● ఖాళీ అవుతున్న చెరువులు

రైల్వేకోడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. అధికారుల అనుమతి లేకుండా చెరువుల్లోని మట్టిని అక్రమంగా తరలించి లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. చెరువుల్లో మట్టిని తోడుకోవాలంటే ఇరిగేషన్ శాఖాధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అది కూడా నిబంధనల ప్రకారం మట్టిని తీసుకోవాల్సి వస్తుంది. ఇరిగేషన్ శాఖకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించి తర్వాత మార్కింగ్ ఇచ్చిన ప్రాంతాల్లోనే మట్టి తవ్వకాలు చేయాల్సి ఉంటుంది. ఇలా కాకుండా మట్టి మాఫియా అక్రమార్కులు అనుమతి తీసుకోకుండా ఖద్దరు అండదండలతో రెచ్చిపోయి ఎక్స్‌కవేటర్లతో మట్టిని లోడి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలో 22 చెరువులు, పుల్లంపేట మండలంలో 20 చెరువులు, ఓబులవారిపల్లె మండల పరిధిలో 10 చెరువులు, పెనగలూరు మండలంలో 19 చెరువులు, చిట్వేలి మండలంలో 7 చెరువులు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న చెరువుల నుంచి అక్రమంగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మట్టిని ఒక్క ట్రాక్టర్ రూ.400కు విక్రయాలు చేస్తున్నారు. మట్టిని చాలా వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మట్టి మాఫియా అక్రమార్కులు అమ్ముకుంటున్నారు. ప్రధానంగా రైల్వేకోడూరు మండలంలోని కంచెమ్మ చెరువు, కోడూరు పెద్ద చెరువు, కుప్పాలమ్మ చెరువు తదితర చెరువుల్లో మట్టి పుష్కలంగా ఉండడంతో మట్టి మాఫియా అక్రమార్కుల కన్నుపడింది. దీంతో చెరువులలో మట్టిని విపరీతంగా తోడేస్తున్నారు. రోజుకు ఒక్క చెరువులో సుమారు 100 ట్రాక్టర్లకు పైగా మట్టిని తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రైల్వేకోడూరు మండలానికి చెంది ఒక వ్యక్తికి రాజకీయ పలుకుబడి ఉండడం, ఎక్స్‌కవేటర్లు ట్రాక్టర్లు ఉండడంతో ఆ వ్యక్తి మట్టి ఎక్కడ కనిపించినా వదలడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. స్థానికులు మట్టి మాఫియా గురించి అధికారులకు తెలియజేసినా ఫలితం లేదని వాపోతున్నారు. రోడ్డు పనులకు మట్టి, రాళ్లు చాలా అవసరం ఉంటుంది. దీంతో కాంట్రాక్టర్లు చాలా వరకు అక్రమార్కులను ఆశ్రయిస్తున్నారు. అవసరానికి ఎంత పెట్టి అయినా తీసుకుంటున్నారు. మట్టి మాఫియా అక్రమార్కులు విచ్చలవిడిగా కొల్లగొట్టడడంతో చెరువులలో నీరు నిలువకుండా పక్కదారి పడుతున్నాయని, గొర్రెలు, మేకలకు నీరు లేకుండా చేస్తున్నారని కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేకాకుండా చెరువుల వద్ద మేత లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని మట్టి మాఫియా అక్రమార్కులపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రైల్వేకోడూరు మండలం కంచెమ్మ చెరువులో యంత్రాలు పెట్టి మట్టిని తోడుతున్న దృశ్యం

అధికారులు ఏమంటున్నారంటే..

మట్టిని అక్రమంగా తరళించ రాదని, అనుమతి తీసుకుని చెరువుల నుంచి తీసుకునిపోవాలని, ఇరిగేషన్‌శాఖ అనుమతి తప్పని సరిగా తీసుకుని మట్టిని తరలించాలని రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్‌చాండ్ తెలిపారు. చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వుతున్నారని ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం అందించామని, స్థానిక వీఆర్‌వోకు చెరువులను పరిశీలించి తవ్వకాలు జరుగుతుంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించామని తెలిపారు. ప్రధానంగా చెరువులు ఇరిగేషన్‌శాఖ పరిధిలో ఉంటాయి కాబట్టి వాటిలో తవ్వకాలు చేయాలని వారి అనుమతి తీసుకుని మట్టిని తరలించాలన్నారు.

పిడుగుపాటుకు రైతు మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి



నాగరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గుట్టలపై పంచాయతీ నడింపల్లెలో పొలంలో పిడుగు పడడంతో నాగరాజు(43) మృతి చెందాడు. అతని భార్య పార్వతి, తల్లి చిన్నక్కకు కూడా ఈ ఘటనలో గాయాలయ్యాయి. నాగరాజు, అతని భార్య, తల్లి ముగ్గురూ కలిసి ఆదివారం మధ్యాహ్నం పొలంలో వేరుశెనగ నూర్పిళ్లు చేస్తుండగా పిడుగు పడింది. దీంతో నాగరాజు అక్కడిక్కడే మృతి చెందగా పార్వతి, చిన్నక్కకు గాయాలయ్యాయి. గమనించిన తోటి రైతులు ముగ్గురినీ పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఆరా తీసిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్వతి, చిన్నక్కను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించాలని తెలియడంతో అక్కడి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి వారికి నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, సంఘం శివారెడ్డి, మహేంద్ర రెడ్డి, మహమ్మద్ పీర్, ఎన్టీఆర్ నఫీస్, గాయం వెంకటరెడ్డి, వసంతాల రాజా, ఖాదర్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన గంగాధర్, గోపి

మదనపల్లె అర్బన్, అక్టోబరు20: వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో గంగాధర్, గోపి తీవ్రంగా గాయపడిన వారిని ఆదివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఇందులో కర్ణాటక రాష్ట్రం, సోమయాజులపల్లె తాలుకా, పెగలపల్లెకు చెందిన గంగాధర్ వ్యక్తిగత పనులపై రామసముద్రం వచ్చారు. రామసముద్రం నుంచి మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యలో కాప్పల్లె వద్ద మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ముఖం, తలపై గాయాలయ్యాయి. పుంగనూరు మండలం దండుపాళ్లెం వాసి వెంకటరమణ కుమారుడు గోపి(45) ద్విచక్రవాహనంలో వెళ్లుతుండగా కొత్తయిండ్లు సమీపంలో కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనలో గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

పీఆర్‌టీయూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

రాయచోటిటౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి డైట్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా కృష్ణయ్య, గిరిప్రసాద్ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా మూడే సూర్యుడునాయక్, ప్రధాన కార్యదర్శిగా ఉమా మహేశ్వర్, జిల్లా గౌరవాధ్యక్షుడిగా అహమ్మద్‌బాషాను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ యూనియన్ ఎనలేని పోరాటాలు చేసిందన్నారు. జిల్లా నూతన కమిటీ సభ్యులు భవిష్యత్తులో ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయడం ద్వారా యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 12వ పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ గుజ్జల తిరుపాల్, పీఆర్‌టీయూ వైఎస్ఆర్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకటశివారెడ్డి, రాష్ట్ర నేతలు మల్లికార్జునరెడ్డి, టీఎల్ నరసారెడ్డి, సాహిబ్‌జాన్, కేఎస్‌జాకీర్ హుస్సేన్, సిద్ధూనాయక్, సురేశ్, హుస్సేన్‌బాషా, మల్లికార్జునరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు, పీఆర్‌టీయూ మండల, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, సంఘ శ్రేయోభిలాషులు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో పోలీసుల తనిఖీ

- అప్రమత్తమైన వ్యాపారులు



మార్కెట్ వీధిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

జమ్మలమడుగు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, సిబ్బంది పట్టణంలోని పలు వీధుల్లో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఆదివారం రాత్రి 7 గంటల నుంచి ఏకకాలంలో పాత బస్టాండులోని ముద్దనూరు రోడ్డు లాడ్జీలు, వివిధ దుకాణాలు తనిఖీ చేపట్టారు. అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐలు రామక్రిష్ణ, కల్పన, ప్రొద్దుటూరు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు, ప్రొద్దుటూరు టుటౌన్ ఎస్ఐ ధనుంజయుడు, మరో 30 మంది కానిస్టేబుళ్లు తనిఖీ చేశారు. కూరగాయల మార్కెట్‌వీధిలో ఓ దుకాణం వద్ద పోలీసులు సుమారు అరగంటపాటు వేచి చూశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు బంధువుల దుకాణాల యజమానులకు అప్రమత్తం చేసినట్లు తెలిసింది. ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీ చేపట్టినట్లు పోలీసు సిబ్బంది ద్వారా తెలిసింది. పట్టణంలోని ట్రాన్స్‌పోర్టు ఆఫీసులు, లాడ్జీలు లైసెన్సులేని క్రాకర్స్ విక్రయించే దుకాణాలను తనిఖీ చేపట్టారు. పెద్దపసుపుల రోడ్డులో ఈకార్ట్ లాజిస్టిక్స్ దుకాణం, టీచర్స్ కాలనీలో తనిఖీ చేపట్టారు. పట్టణంలో పోలీసులు సంచరించడంతో అక్రమ వ్యాపారాలు చేసే కొందరు అప్రమత్తమైనట్లు తెలిసింది. కొందరు రాజకీయ నేతలు పోలీసు అధికారులకు ఫోన్లు కూడా చేసి సమాచారం అడిగినట్లు తెలిసింది. ఏదేమైనా లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సమాచారం. పట్టణంలో సాయంత్రం నుంచి రాత్రి 9.30 గంటల వరకు పోలీసు అధికారులు, సిబ్బంది పట్టణంలో జల్లెడ పట్టారు. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, తదితర గ్రామాల్లో కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్ సమస్యలు, విద్యార్థినులపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి చర్యలు చేపట్టాలని, ఎక్కడైనా పాఠశాల, కళాశాలలకు బయట వెళ్లేవారి మహిళా విద్యార్థినులపై పోకిరి వారు పెట్టే ఇబ్బందులకు పోలీసులు విచారించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయం - రైతుకు ఆదాయం



- 15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం
- ప్రకృతి వ్యవసాయ పాఠశాలతో రైతులకు సలహాలు
- ఐదంచెల సేద్యంతో అధిక లాభాలు : ఆదర్శ రైతు

నిమ్మనపల్లి, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో ఆరితేరాడు. 15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ తాను లాభాలు పొందడమే కాకుండా ప్రకృతి వ్యవసాయ పాఠశాల ద్వారా మరింత మంది రైతులకు సలహాలు ఇస్తూ వారిని కూడా ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తవలం పంచాయతీ చౌకిళ్లవారిపల్లె రైతు గుమ్మడి గంగులప్ప సామాన్య రైతు కటుంబీకుడు. ప్రకృతి వ్యవసాయం ఆద్యుడు డాక్టర్ సుభాష్‌పాలేకర్‌ను సైతం గంగులప్ప చేస్తున్న వ్యవసాయం నిమ్మనపల్లికి రప్పించింది. ఒక ఆవుతో 30 ఎకరాలు సాగు చేయవచ్చని నిరూపించాడు.

వివరాల్లోకెళితే....

చౌకిళ్లవారిపల్లె రైతు గుమ్మడి గంగులప్ప సామాన్య రైతు కటుంబీకుడు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టినిలిపి ప్రకృతి వ్యవసాయంతో తాను లాభాలు పొందడమే మరింత మంది రైతులకు సలహాలు ఇస్తూ వారిని కూడా ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. బెంగళూరుకు చెందిన సురేష్ అనే రైతు తనతో మాట్లాడుతూ ఒక ఆవుతో 30 ఎకరాలు సాగు చేయవచ్చన్నారు. దీంతో ప్రకృతి వ్యవసాయంపై మక్కువతో అతడి సలహాలు తీసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాడు. అనంతరం ప్రకృతి వ్యవసాయ వైద్య విజ్ఞాన కేంద్రం పేరుతో జీవరక్షణ, గోసంరక్షణతో రిజిస్ట్రేషన్ చేసి ప్రకృతి వ్యవసాయ పాఠశాలను ప్రారంభించాడు. ప్రస్తుతం వ్యవసాయ పొలంలో ప్రకృతి నర్సరీని ఏర్పాటు చేసి వాటి ద్వారా నారును రైతులకు అందిస్తూ తాను కూడా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాడు. రైతు గంగులప్ప ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రస్తుతం క్రిమి సంహారక మందుతో పండించే పంటల ద్వారా మానవాళికి ముప్పు ఏర్పడిందని తెలిపారు. ఫలితంగా స్వచ్ఛమైన ప్రకృతి వ్యవసా యంతో

కూరగాయలు పండిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మామిడి తోటలో అంతర పంటగా మిరప, టమాట, వంగ, బీర, కాకర, బెండ, పసుపు, అనప, గుమ్మడి, అరటి, మునగ, హర్యానా సొద్దల పంటను పండిస్తున్నట్లు తెలిపారు. తనకు ఉన్న 5 ఆవుల్లో పుంగనూరు, ఒంగోలు జాతికి చెందిన ఆవులు ఉండగా వాటి ద్వారా పేడను సేకరించి పంటకు వాడుతున్నట్లు తెలిపారు. ఈ పంటలను కేవలం ఆవు నుంచి సేకరించిన పేడ ద్వారా జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసి మజ్జిగ వంటివి వేసి పంటకు వేస్తానని తెలి పారు. అలాగే నర్సరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని రకాల కూరగాయలు ఎకరాకు 10 టన్నులు పండిస్తున్నట్లు తెలిపారు. మార్కెటింగ్ సక్రమంగా ఉంటే లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. అంతేకాకుండా పలువురు రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి సల హాలు, సూచనలు కావాలంటే 9059125954 ను సంప్రదించాలని తెలిపారు.

ఐదంచెల విధానంతో అధిక లాభాలు

ఐదంచెల విధానం అనగా ఒకటి.. భూమిలోపల పండే గడ్డజాతి ముల్లంగి, బంగాళదుంప, రెండోది మిరప వంగ, మూడోది బీర కాకర, పొట్ల, నాలుగోది జామ, సపోట దానిమ్మ, బొప్పాయి, అరటి, మునగ ఐదోది శాశ్వత పంటలు అల్లనేరేడు మామిడి, కొబ్బరి ద్వారా అధిక లాభాలు సాధించ వచ్చని తెలిపారు.

సుభాష్ పాలేకర్‌ను పల్లెకు రప్పించిన రైతు

గంగులప్ప చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని చూసేందుకు డాక్టర్ సుభాష్‌పాలేకర్ నిమ్మనపల్లిలోని చౌకిళ్లవారిపల్లికి వచ్చి ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించి ప్రశంసించారు. 2016 హైదరాబాద్‌లో వెంకయ్యనాయుడు ద్వారా ఉత్తమ రైతు ప్రశంసా పత్రం అందుకున్న ఘనత గంగులప్పది.



ప్రకృతి వ్యవసాయంతో పండించిన అరటి



ఏపుగా పెరిగిన మునగచెట్టు చూపుతున్న రైతు గంగులప్ప



గంగులప్ప ప్రారంభించిన నర్సరీ

సలాం పోలీస్



- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- 31 వరకూ జిల్లాలో వారోత్సవాలు
- కలికిరి సీఆర్పీఎఫ్‌లో సద్భావనా దివస్ పేరుతో నేడు ప్రత్యేక కార్యక్రమాలు





కలికిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ కోసం నిరంతరం రేయింబవళ్లు కష్టించే పోలీసులకు సలాం పెట్టాలి. శెలవనే ప్రశ్న తలెత్తని ఉద్యోగం వారిది. 24 గంటలూ సేవలు చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా వదిలేసిన అమరులకు పాదాభివందనం చేయాలి. అక్టోబరు 21 నుంచి అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడానికి జిల్లా పోలీసులు సమయాత్తమవుతున్నారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని పదిరోజులకు సరిపడా కార్యక్రమాలను రూపొందించారు. జిల్లాలో అమరవీరులను గుర్తించడం, వారికి శాశ్వత గుర్తింపుగా వీధులు, తదితర వాటికి వారి పేర్లు పెట్టడం, అమర వీరులు చదివిన పాఠశాలల్లో వారి ఫొటోలు పెట్టడం, చివరిరోజు వారి తల్లిదండ్రులను సన్మానించడం, 31న జిల్లా వ్యాప్తంగా యూనిటీ రన్, సమైక్యతా దినం నిర్వహణ, క్యాండిల్ ర్యాలీలు కార్యక్రమాలను రూపొందించారు.

సీఆర్పీఎఫ్‌కు పెను సవాళ్లు

1959 అక్టోబరు 21న అనూహ్యంగా మొదటిసారి చైనా నుంచి ఎదురు దెబ్బ తగిలి 10 మంది సహచరులను కోల్పోవడంతో సీఆర్పీ పేరు సహా సీఆర్పీఎఫ్‌గా తన దిశను మార్చుకోవలసి వచ్చింది. శత్రు దేశాలపై పోరాటాలకు పరిమితమైన సీఆర్పీ పేరు మార్చుకుని దేశ అంతర్గత భద్రతను సవాలుగా తీసుకుంది. దేశంలో ఎక్కడ బాంబుల మోత, తుపాకీల శబ్దం వినిపించినా వాటిని ఎదుర్కోవడానికి సీఆర్పీఎఫ్ సిద్ధంగా ఉంటుంది. చిన్న చిన్న అల్లర్ల అణచివేత మొదలు అత్యంత భయంకరమైన ఉగ్రవాద నిరోధం వరకూ, రాజకీయ నేతలకు భద్రత కల్పించే వరకూ శౌర్య శక్తితో ఇప్పుడు సీఆర్పీఎఫ్ దేశ వ్యాప్తంగా విస్తరించింది. సాంకేతిక, ఆయుధ సామర్థ్యం కాకుండా మూడు లక్షలకు పైగా మానవ సామర్థ్యమున్న సాయుధ బలగాల్లో ఇప్పుడు సీఆర్పీఎఫ్ ఒక్కటే అగ్రగామి.

కలికిరిలో అగ్రగామి శిక్షణ సంస్థ

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలోని వివిధ రకాల శిక్షణ సంస్థల్లో అగ్రగామిగా చెప్పుకొనే సీఐఏటీ-3 స్కూల్ కలికిరిలో నెలకొల్పారు. కలికిరికి ఐదు కిలోమీటర్ల దూరంలో పాలెంకొండ వద్ద ఏర్పాటు చేశారు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మూడింటిలో ఇది మూడోది. సీఆర్పీఎఫ్‌లో ప్రధానంగా 203 ఎక్జిక్యూటివ్ బెటాలియన్లున్నాయి. వీఐపీ సెక్యూరిటీ బెటాలియన్‌లు ఐదున్నాయి. ఆరు మహిళా బెటాలియన్లు, 15 ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బెటాలియన్‌లు, 7 సిగ్నల్ బెటాలియన్లు మరో స్పెషల్ డ్యూటీ గ్రూపు కూడా ఉంది. అంతేకాకుండా అత్యంత చురుకైన, రాటుదేలిన బెటాలియన్.. కమాండో బెటాలియన్ ఫర్ రెసల్యూట్ యాక్షన్ (కోబ్రా) అత్యంత సాహసవంతమైందే కాకుండా శక్తివంతమైంది కూడా. బెటాలియన్‌లో వివిధ కేడర్లలో 1200 మంది ఉంటారు. బెటాలియన్‌కు కమాండెంట్ నాయకత్వం వహిస్తారు. ఒక బెటాలియన్ ఏడు కంపెనీలుగా ఉంటుంది. ఒక్కో కంపెనీకి ఒక అసిస్టెంట్ కమాండెంట్ సారథ్యం వహిస్తారు. ఇదంతా ఒక ఎత్తయితే బెటాలియన్ దళాలను సర్వసన్నద్ధులుగా తయారు చేయడానికి అనేక స్థాయిల్లో శిక్షణా కేంద్రాలు నిరంతరం పని చేస్తుంటాయి. దేశంలో మూడు ప్రత్యేక శిక్షణ కేంద్రాలున్నాయి. సీఐఏటీ (కౌంటర్ ఇన్‌సర్జన్సీ అండ్ యాంటీ టెర్రరిజమ్) ఉగ్రవాద నిర్మూలన, తీవ్రవాద నిరోధక శిక్షణ సంస్థ. ఇవి దేశంలో సిల్‌చార్ (అస్సాం)లో ఒకటి, శివపురి (మధ్యప్రదేశ్) మరొకటి వుండగా మూడోది దక్షిణాది కలికిరిలో ఉంది. సీఆర్పీఎఫ్ ప్రాంగణలోనే ఉన్న ఈ సీఐఏటీ-3 శిక్షణ అత్యంత సున్నితమైంది, మరింత కఠోరమైనదిగా చెబుతారు. శిక్షణ పూర్తయిన అనంతరం నిగ్గుదేలిన వారిని ప్రత్యేకంగా ఎంపిక చేసి చివరగా సీఐఏటీలో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో తిరిగి రకరకాల విభాగాల్లో నిష్ణాతుల్ని చేయడానికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

సీఐఏటీ శిక్షణలో నిష్ణాతులు

అనేక రకాల పోరాట పటిమల్లో ఆరితేరిన వారికి కలికిరి సీఐఏటీలో శిక్షణ ఇస్తున్నారు. 175 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నెలకొల్పారు. పాలెంకొండ దిగువన దాని చుట్టూ సీఆర్పీఎఫ్ సహా 53వ ఐటీబీపీ, 65 వ బీఎస్ఎఫ్ బెటాలియన్‌లు కూడా ఉన్నాయి. 169 ఎకరాల్లో ప్రత్యేకంగా ఫైరింగ్ రేంజి ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా పది పడకల ఆస్పత్రి కూడా వుంది. శిక్షణ పొందే వారికి కాకుండా శిక్షణ అందజేసేందుకు ఉన్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి 180 కుటుంబాలకు వసతి సముదాయాలున్నాయి. సీఐఏటీ డీఐజీగా అనుపమ్ శర్మ పనిచేస్తున్నారు. ఇద్దరు కమాండెంట్లు, ఒక సెకం డ్ ఇన్ కమాండెంట్, ఐదుగురు డిప్యూటీ కమాండెంట్లు, ఐదుగురు అసిస్టెంట్ కమాండెంట్లు, 15 మంది ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు ఎస్ఐలు, 10 మం ది ఏఎస్ఐలు, 150 మంది హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు ఉన్నారు. ఇక 4 నుంచి 6 లేక 9 వా రాల పాటు శిక్షణ పొందే వారు బ్యాచ్‌లుగా వచ్చి శిక్షణ పూర్తయ్యాక వెళుతూ వుంటారు.



కలికిరి సీఆర్పీఎఫ్ సింహద్వారం

సంస్మరణ దినం ప్రత్యేకత

అమర వీరుల సంస్మరణ దినం సీఆర్పీఎఫ్‌కు ఎంతో ప్రత్యేకమైంది. ఏటా ప్రాంగణలో అనేక ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సీఆర్ఎఫ్ సాహస కృత్యాల ఫలితంగానే ఈ ప్రత్యేకమైన దినం ఏర్పాటైందని ఘనంగా చెబుతుంటారు. ఉదయం నుంచి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించడం, డీఐజీ భావోద్వేగ సందేశాలతో కూడిన ప్రసంగాలు, కుటుంబాలతో కలిసి ఆటల పోటీలు, రాత్రంతా సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతుల పంపిణీ, ప్రత్యేక విందులు ఏర్పాటు చేస్తారు. సీఐఏటీ ప్రత్యేకత దృష్ట్యా సీఆర్పీఎఫ్ డీజీపీ కూడా తరచూ హాజరవడం రివాజు.

210లీటర్లు నాటుసారా సీజ్ - ఒకరి అరెస్ట్



నాటుసారా, నిందితుడితో ఎస్ఐ శ్రీహరి

వాల్మీకిపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గండబోయనపల్లెలో ఆదివారం విస్తృత దాడులు చేసి 210 లీటర్ల నాటుసారా సీజ్ చేసి గురునాథ్‌ను అరెస్టు చేశారని ఎస్ఐ శ్రీహరి తెలిపారు. కొండకింద మేకలవారిపల్లె అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ బట్టీలపై దాడులు చేశారన్నారు. బట్టీలు, 5వేల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. 210లీటర్ల నాటుసారా సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేయగా రెడ్డెప్ప, నాగరాజు పరారయ్యారన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది దస్తగిరి, వెంకటేష్, గంగరాజు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ లక్ష్యం

- నాణేలు సేకరణలో వసీమా అస్లాం
- ఇప్పటికే 30 దేశాల నాణేలు, నోట్లు, మెడల్స్ సేకరణ

రైల్వేకోడూరు, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్‌లో పేరు సంపాదించాలన్న లక్ష్యంతో ఓ యువకుడు దేశ విదేశాలకు చెందిన అనేక నాణేలను సేకరిస్తున్నాడు.

రైల్వేకోడూరు వాసి వసీమాఅస్లాం బీటెక్ చదివాడు. తండ్రి నడుపుతున్న హోటల్‌లో చేదోడువాదోడుగా ఉంటూనే వివిధ దేశాలకు చెందిన నాణేలు, నోట్లు, మెడల్స్ తదితరాలను సేకరిస్తున్నాడు. క్రీస్తు పూర్వం 200, 300 ఏళ్ల నాటి నాణేలు, మౌర్యులు, శాతవాహనులు, చోళులు, మట్లిరాజులు, నిజాం నవాబులు, ఢిల్లీ సుల్తాన్ కాలంలో చలామణిలో ఉన్న నాణేలు, ఇండియా, దుబాయ్, కువైట్, కత్తర్, సౌదీ, బెహరిన్, పాకిస్తాన్, కెనడా, సింగపూర్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, లండన్, రష్యా, చైనా, యూరప్ తదితర దేశాల్లో వివిధ కాలాల్లో చలామణిలో ఉన్న నాణేలు, కరెన్సీ, ప్రపంచ యుద్ధంలో సైనికులకు ఇచ్చిన పతకాలు సేకరించాడు. ఇప్పటి వరకూ 75,250 నాణేలు సేకరించినట్లు ఆయన చెబుతున్నాడు. వీటితో పాటు కొలంబియాలో పాతకాలం నాటి గ్రామ్‌ఫోన్ రికార్డులు, పెన్నులు తదితరాలను కూడా సేకరించాడు. చిన్నతనం నుంచే నాణేలు తదితరాల సేకరణ అలవాటుగా మార్చుకున్న అస్లాం వద్ద ప్రస్తుతం భారత దేశానికి చెందిన నాణేలు, స్వాతంత్ర్యం నాటి నుంచి మనుగడలో ఉన్న ఉన్న నాణేలు కూడా ఉన్నాయి. సేకరించిన నాణేలు, కరెన్సీ తదితరాలను పలు ప్రాంతాల్లో, ప్రదర్శిస్తూ చరిత్రపై అవగాహన కల్పిస్తున్నాడు.

గిన్నిస్‌బుక్‌లో స్థానం కోసం శ్రమిస్తున్నా



నాణేలు, కరెన్సీలు, మెడల్స్ సేకరణతో గిన్నిస్ బుక్ రికార్డును సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. చిన్నతనంలోనే నాణేలు, కరెన్సీలు సేకరించాలని భావించాను. దీనినే లక్ష్యంగా కృషి చేస్తున్నా. లిమ్కాబుక్ రికార్డు బ్రేక్ చేసేందుకు అవసరమైనన్ని నాణేలు సేకరించా. గిన్నిస్‌బుక్‌లో స్థానం కోసం నాణేలు సేకరించాల్సి ఉంది.


\- వసీమా అస్లాం, రైల్వేకోడూరు

వివిధ రకాల విదేశీ కరెన్సీ





గ్రామ్‌ఫోన్ రికార్డ్, ఇండియన్ కరెన్సీ



నవానగర్, ఢిల్లీ సుల్తాన్‌కు చెందిన నాణేలు

నిజాం పాలనలో వెండి నాణేలు



విజయనగర పాలనలో ఉన్న బంగారు నాణేలు

ఎడతెరిపిలేని వర్షం... దెబ్బతిన్న పంటలు


నర్సనపల్లెవద్ద వర్షానికి నిలువునా చనిపోతున్న మిరప


ఇటుకులపాడువద్ద నేలకు వాలిపోయిన వరిని చూపుతున్న మహిళ


గంగనపల్లెవద్ద పొలాల్లో కుల్లిన మినుము కుప్పలు

కాశినాయన, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షం రైతన్నకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ప్రకృతి ప్రకోపానికి పంటలు సాగుచేసిన రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో గత రెండు మూడురోజులుగా కురి సిన ఎడతెరిపిలేని వర్షాలకు చేతికి అందివచ్చిన వరి, మినుము, ఉల్లి, మిరప లాంటి అనేక పంట లు దెబ్బతిన్నాయి. ఇటుకులపాడు , రామచంద్రా పురం తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన దాదాపు 50 ఎకరాల్లో వరి పంట కిందపడి పోయి ధాన్యం మొలకలు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సాపురం, మూలపల్లె, నరసన్నపల్లె తదితర గ్రామల్లో నీరు ఎక్కువై మిరప చేలు నిలు వునా చనిపోతున్నాయి. గంగనపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలో కోసి కుప్పలు వేసిన మినుము పంట ఎడతెరిపి లేని వర్షంతో కుళ్లిపోయింది. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంటలు కళ్లముందే వర్షానికి దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈవిష యంపై మండల వ్యవసాయాధికారి జయలక్ష్మిని వివరణ కోరగా ఇటీవల కురిసిన వర్షాలకు పలు రకాల పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో వరి 45 ఎకరాలు, మినుము 40 ఎకరాలు, మిరప 50 ఎక రాలు, ఉల్లి 18 ఎకరాల్లో దెబ్బతిందన్నారు. ఈ మేరకు నివేదికలు తయారు చేసి జిల్లా అధికారులకు అందజేశామని తెలిపారు.

కోతకు వచ్చిన పంట నేలపాలు



ఇటీవల కురిసిన వర్షానికి కోతకు వచ్చిన వరి నేలపాలైంది. రూ.లక్షకుపైగా పెట్టుబడితో 3 ఎకరాల్లో వరి పంట సాగుచేశాను. గాలి వానకు నేలవాలిపోయి పొలంలోనే మొలకలు వస్తున్నాయి. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

-పి.నాగ సుబ్బారెడ్డి, ఇటుకులపాడు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాలుగు ఎకరాలు మిరప (సన్నాలు) పంట సాగు చేశాను. ఇప్పటికే రూ.3.5 లక్షలు పెట్టుబడి అయ్యింది. పూత, కాయ దశలో ఉన్న పంట ఇటీవల కురిసిన వర్షానికి నీరు ఎక్కువై చెట్లు నిలువునా చనిపోతున్నాయి. దీంతో పెట్టుబడులు కోల్పోవాల్సిన పరిస్థితి. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

-బి.రమణయ్య రైతు నర్సనపల్లె.

శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో 1,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి 26 వరకు రెసిడెన్షియల్ పద్ధతిలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం వల్ల వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు, బాలింతలు, చిన్న పిల్లల తల్లిదండ్రులు, బాధ్యతలు చూసుకోవాల్సిన ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక వత్తిడికి గరవుతున్నారన్నారు. పాఠశాల పనివేళల్లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టడం వల్ల ప్రభుత్వ పాఠశాల్లో విద్యాబోధనకు తీవ్ర అంతరాయం కలుగుతుందని.. వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, రామచంద్రరెడ్డి, మణికుమార్, మస్తాన్‌బాబు పాల్గొన్నారు.

పుష్పగిరి క్షేత్రంలో హైకోర్టు జడ్జి



వల్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పుష్పగిరి క్షేత్రంలో ఆదివారం హైకోర్టు జడ్జి కృష్ణమోహన్ శ్రీకామాక్షి సమేత వైద్యనాధున్ని దర్శించుకున్నారు. ఈసందర్భంగా జడ్జికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కామాక్షి సమేత వైద్యనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జి పుష్పగిరి మఠం చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన పుష్ప గిరి క్షేత్రాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తహసీల్దారు శ్రీవాణి, స్థానిక అధికారులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు బయలుదేరిన ఆశాలు


కడప రైల్వేస్టేషన్‌లో ఆశా కార్యకర్తలు

కడప (మారుతీనగర్), అక్టోబర్ 20: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న తలపెట్టిన చలో విజయవాడ (మహాధర్నా) కార్యక్రమానికి ఆదివారం పెద్ద ఎత్తున ఆశా కార్యకర్తలు కడప రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి పలు ఉద్యమాలు చేసినప్పటికీ ప్రభుత్వాలు స్పందించ లేదన్నారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మంత్రులకు , అధికారులకు అనేక మార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఇంతవరకూ అతీగతీ లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి తమకు ఇచ్చిన హామీలు త్వరితగతిన నెర వేర్చాలని కోరారు. లేదంటే సమరశీల పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మ, ఉపాధ్యక్షురాలు అనసూయ, అమ్ములు, దేవి నారాయణమ్మ, రాజేశ్వరి, ముకుంద, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని హత్య చేసిన నిందితున్ని ఉరి తీయాలి : ఆర్ఎస్ యూ



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో బాలికపై అత్యాచారం చేసి నిప్పంటించి ఆ మె మృతికి కారణమైన నిందితున్ని ఉరి తీయాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ప్రభుత్వ బాలుర బీసీ వసతిగృహంలో ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జీవితంపై ఎన్నో ఆశలతో కష్టపడి చదువుకుంటున్న బాలికపై స్నేహితుడి ముసుగులో విఘ్నేశ్ దారుణానికి పాల్పడ్డాడని, ఇది చాలా దారుణమని అన్నారు. తనకు వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయకులు కొండేటి, వెంకటేశ్, ధనుంజయ్, సాయికుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డయల్ 100, 112 సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ

కడప క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు హెల్ప్‌లైన్ నంబర్లు డయల్ 100, 112 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాలో పై నెంబర్లు పనిచేయడం లేదంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని, రెండూ పోలీసు హెల్ప్‌లైను నెంబర్లు యదావిధిగా పనిచేస్తున్నాయని ఎస్పీ తెలిపారు.

మండలి బుద్ధప్రసాద్‌ను కలిసిన హరిప్రసాద్


మండలి బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న హరిప్రసాద్ తదితరులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. మైదుకూరు జనసేన నాయకులు లక్ష్మిభరత్, పసుపులేటి నాగమల్లిఖార్జున్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం



స్వర్ణోత్సవాల్లో భాగంగా ర్యాలీగా వస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు, మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ అలుగపెరగని పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ మనందరి బాధ్యత అని తెలిపారు. ఆదివారం యూటీఎఫ్ భవన్‌లో స్వర్ణోత్సవ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు స్వర్ణోత్సవాల్లో భాగంగా కడప కోటిరెడ్డిసర్కిల్ నుంచి సంధ్యాసర్కిల్ మీదుగా యూటీఎఫ్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపిం చి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. అందరికీ సమాన అవకాశాలు ఉండాలనే ఉద్దేశ్యంతో సోషలిస్టు సమాజం కోసం యూటీఎఫ్ ఏర్పాటు చేశారన్నారు. ఎన్నో లక్ష్యాలు, ఆశయాలు డిమాండ్లను సాధించుకున్నామన్నారు. హక్కుల కోసం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఎంతో పోరాటం చేశామని తెలిపారు. ప్రత్యామ్నాయ విద్యావిధానం కోసం పోరాడింది యూటీఎఫ్ మాత్రమేనని తెలిపారు. సీఐ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ యూటీఎఫ్ జిల్లాలోని అన్ని మండలాల్లో ఉండడం హర్షణీయమన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ స్థాపించడం జరిగిందని.. అప్పటి నుంచి విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు రమాదేవి, గంగిరెడ్డి, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు రవికుమార్, జేఈఈ నాయకులు షమీర్‌బాషా, యటిఎఫ్ నాయకులు నాగార్జునరెడ్డి, రవికుమార్, నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

సోంపల్లెలో ఘర్షణ.. ఆరుగురికి గాయాలు

ముద్దనూరు అక్టోబరు 20: మండల పరిధి సోంపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చేసుకోవడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలు... మండల పరిధి సోంపల్లె గ్రామానికి చెందిన మూలె నాగమునిరెడ్డి, ఎర్రంరెడ్డి రామక్రిష్టారెడ్డి కుటుంబాల మధ్య పాత కక్ష్యలు ఉన్నాయి. రెండు కుటుంబాలు కట్టెలు, రాడ్లతో ఘర్షణకు పాల్పడటంతో ఇరు కుటుంబాలకు చెందిన ఆరుగురికి రక్త గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని గాయపడిన వారిని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్మీ జవాన్ రాజేష్ అంత్యక్రియలు నేడు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్ లోని అబుజ్‌మడ్ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన బాంబు పేలి మండలంలోని పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రాజేష్ (37) అనే జవాను మృతి చెందిన విషయం తెలిసిందే.. రాజేష్ మృతదేహం ప్రస్తుతం ఆదివారం బెంగుళూరు నుంచి స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రాజేశ్ 2007 నుంచి ఐటీబీపీలో జవానుగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు జానయ్య, బాలమ్మ గ్రామంలో వ్యవసాయ కూలీల పనులు చేసుకుంటూ కుమారుడిని చదివించారు. వీరికి ముగ్గురు మగపిల్లలు. ఇరు వు రు ఆడపిల్లలు సంతానం. మృతి చెందిన రాజేశ్ నాలుగవ సంతానం. రాజేశ్‌కు భార్య, ఇరువురు కుమా రులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య పాపిరెడ్డిపల్లెలోనే ఉంటూ పిల్లలను చదివి స్తో ంది. రాజేశ్ మృతితో గ్రామంలో విషాధయలు అలుముకున్నాయి.

పిడుగు పాటుకు 18 పొట్టేళ్లు మృతి



గాలివీడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూముకుంట గ్రామం నాయునివారిపల్లెలో కొర్రు రామప్ప నాయుడుకు చెందిన 18 పొట్టేళ్ల పిడుగుపాటుకు మృతి చెందాయి. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం నాయునివారిపల్లె తూర్పు వైపున తెల్లకొండ సమీపంలోని పంట పొలాల్లో పొట్టేళ్ల మేస్తుండగా ఒక్కసారిగా ఉన్నట్లుండి పిడుగు పడటంతో 18 పొట్టేళ్ల మృతి చెందాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టేళ్ల విలువ దాదాపు 2.50 లక్షలు ఉంటుందని, తాను తీవ్రంగా నష్టపోయానని రైతు బోరున విలపించారు. పిడుగుపాటు కు తాను కూడా గాయపడ్డానని, 10 నిమిషాల పాటు మతి లేకుండా పోయిందని తెలిపారు. సంఘటన తెలిసిన వెంటనే సర్పంచ్ కుమార్‌నాయుడు, వీఆర్‌వో శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ భద్రప్పనాయుడు, టీడీపీ కదిరిరెడ్డి నాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నష్టపరిహాన్ని అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రచయితల మహాసభకు మండలికి ఆహ్వానం

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల మహాసభకు తెలుగుభాషా సేవకులు భాషోద్ధారకులు, శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్‌ను ఆహ్వానించినట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూల మల్లిఖార్జున రెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మండలిని రచయితల సంఘం సభ్యులు కలిసి 2025 జనవరిలో జరిగే మహాసభలకు రావాలని ఆహ్వానం అందించారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ కె.శేఖర్‌రెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి పలువురు పాల్గొన్నారు.

నిందితుల కోసం కొనసాగుతున్న వేట

కడప క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై కర్రలతో దాడి చేసిన నిందితుల కోసం పోలీసు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం అప్సర నుంచి ఇంటికి వెళుతున్న క్రమంలో ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తుంది. దాడి చేసిన వారిలో ఒకరిని గుర్తించి.. అతన్ని పట్టుకునేందుకు వేట సాగిస్తున్నారు. అయితే దాడికి గల కారణం సొంత పార్టీ వర్గమా లేక ఇతరులు ఎవరైనా దాడి చేశారా అన్న విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

గండికోటప్రాజెక్టులో నిలకడగా నీటి మట్టం



కొండాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గండి కోట ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రానికి 26.22 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో గాని ఔట్‌ఫ్లో గాని లేనందున నీటిమట్టం నిలకడగా ఉందన్నారు. గండికోట అనుబంధ రిజర్వాయర్లలో కూడా నీటిమట్టం పూర్తిస్థాయిలో ఉన్నందున నీటిని ఎక్కడికి వదలడం లేదన్నారు. తదుపరి వచ్చే నీటిని బట్టి ఇతర రిజర్వాయర్లకు నీరు వదిలే అవకాశం ఉంటుందని డీఈ తెలిపారు.

కోతికి అరటి పండు పెట్టాడని..

యువకుడికి కత్తిపోట్లు.. చికిత్స ● రేణిగుంట-మామండూరు మధ్య ఘటన


రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీల్‌కుమార్

రైల్వేకోడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైలులో ఓ వ్యక్తి దగ్గర ఉన్న కోతికి అరటి పండు పెట్టాడని కోతి నిర్వాహకుడు యువకుడిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆదివారం తిరుపతి జిల్లా రేణిగుంట-మామండూరు మధ్యలో జరిగింది. గాయపడిన వ్యక్తికి రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేశారు. బాధితుడి వివరాల మేరకు... ఆదివారం ఉదయం ఓబులవారిపల్లె మండల పరిధిలో ఉన్న బొంతవారి పల్లె దళితవాడకు చెందిన జవ్వాది లక్ష్మయ్య, రేవూరి సునీల్‌కుమార్, పండుగోల శేఖర్ తదితరులు మద్యం ఎక్కువగా తాగేవారు. వీళ్లు రేణిగుంట మండల పరిధిలోని కరకంబాడి గ్రామ సమీపంలో ఉన్న కట్టాపుట్టాలమ్మ దేవస్థానం వద్దకు వెళ్లి మద్యం తాగకుండా దేవుడి వద్ద ప్రమాణం చేసి పూజలు నిర్వహించి.. రైల్వేకోడూరుకు వచ్చేందుకు నంద్యాలకు వెళ్లే రైలును ఎక్కడానికి రేణిగుంటకు వెళ్లారు. అక్కడ రైలు ఎక్కగానే ఒక వ్యక్తి కోతిని పట్టుకుని ఉండటాన్ని సునీల్‌కుమార్ గుర్తించాడు. తన దగ్గర ఉన్న స్వామి ప్రసాదం అయిన అరటి పండును తీసుకుని కోతికి పెట్టడంతో ఉన్నఫళంగా కోతి నిర్వాహకుడు సునీల్‌కుమార్‌పైకి గొడవకు దిగాడు. ఇరువురి మధ్య మాటమాట పెరిగింది. కోతి పట్టుకుని ఉన్న వ్యక్తి తన దగ్గర ఉన్న చిన్నపాటి కత్తితో సునీల్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో సునీల్‌కుమార్ తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం పక్క బోగీలో ఉన్న సునీల్‌కుమార్ బంధువులకు తెలిసి వారు రావడంతో బాలపల్లె రైల్వేస్టేషన్‌లో కోతిని పట్టుకున్న వ్యక్తి దిగి పరారయ్యాడు. గాయపడిన సునీల్‌కుమార్‌ను రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. సమాచారం తెలిసిన స్థానిక పోలీసులు విచారించారు. సంఘటన తమ పరిధిలోకి రాదని తెలపడంతో విచారణ చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ రవి తెలిపారు.

శివాలయంలో పూజలు


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఓబులవారిపల్లె,అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్మవరం శివాలయంలో ఆదివారం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

అరిగె సుమంత్‌కు డాక్టరేట్



నందలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నందలూరు మండలం అరవపల్లెకు చెంది న అరిగె సుమంత్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మద్రాసు నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ తేజేంద్ర దీక్షిత్, ప్రొఫెసర్ వి.కామకోటి, ప్రధాన మంత్రి భద్రత సలహా మండలి సభ్యుడు ఆర్టిఫికల్ ఇంటెలిజెన్స్ టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్, డైరెక్టర్ ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ రామ చంద్రరావు పర్యవేక్షణలో. సెమీ కండక్టర్‌పై పరిశోధనలు చేసినట్లు తెలియజేశారు.

టీడీపీ నేత బొడ్డే సుబ్బనాయుడు మృతి



ఒంటిమిట్ట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతరాజుపలెకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు బొడ్డే సుబ్బానాయుడు(74) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన చింతరాచపల్లె సర్పంచ్‌గా, కోదండ రామాలయం ఛైర్మన్‌గా పనిచేశారు.. రాజంపేట పా ర్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు, పలువురు టీడీపీ నాయకు లు వారి కుటుంబీకులను పరామర్శించి భౌతిక కాయానికి నివాళుల ర్పించారు.

పేదలకు అల్పాహారం పంపిణీ


పేదలకు అల్పాహారం అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నందలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లె బంగ్లా కూడలిలో స్పెషల్ పోలీస్ ఎస్ఐ లయన్ మన్నెం రామమోహన్ కుమారుడు మన్నెం యశ్వంత్ పుట్టినరోజు సందర్భంగా లయన్స్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్ కుర్రామణియాదవ్, వాకర్ మోడపోతుల రాము, న్యాయవాది దాసరి నరసింహులు, వాకర్ గాడి సునీల్‌రెడ్డి, గంధం గంగాధర్, తీగలకుంట వెంకటేష్, గుండు సురేష్ పాల్గొన్నారు.

గంగమ్మకు ఘనంగా బోనాలు

లక్కిరెడ్డిపల్లె అక్టోబర్(ఆంధ్రజ్యోతి) 20: మండలంలోని అనంతపురంలో వెలసిన గంగమ్మ కు ఆధివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ,దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కుబడులు చెల్లించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చెంతనే నీరున్నా.. తీరని దాహార్తి

- వరుణుడు కరుణిస్తేనే.. తాగునీరు
- ఐదేళ్లుగా కురవని వర్షాలు
- భయపెడుతున్న ఫ్లోరైడ్ భూతం..



రవీంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన సంపు, కోర్టు వద్ద నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మిట్ట ప్రాంతాలైన లక్కిరెడ్డిపల్లె రామాపురం మండలాల్లో వర్షాలు కురిస్తేగాని తాగడానికి గుక్కెడు మంచినీరు దొరకదు. గత ఐదు సంవత్సరాల నుంచి ఈ ప్రాంతంలో వర్షాలు సక్రమంగా కురవడం లేదు . దీంతో బోర్లు ఎండిపోయాయి. భూ గర్భ జలాలు అడుగంటడంతో బోరు నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉంటోంది. దీంతో మద్దిరేవుల హరిజన వాడలో ప్రతి ఒక్కరూ కీళ్లు, మోకాళ్లు, నడుము నొప్పులతో మంచాన పడ్డారు. 2012లో ఈ ప్రాంతాలకు తాగు నీరు అందించేందు రూ.53 కోట్లతో రోళ్లమడుగు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సానిపాయి, రాయచోటి, బండపల్లె, కుమ్మరిపల్లె, లక్కిరెడ్డి పల్లె రవీంద్రనగర్ ప్రాంతాల్లో సంపులను ఏర్పాటు చేసింది. ఈ సంపుల నుంచి పైపులైను ద్వారా లక్కిరెడ్డిపల్లె, చింతకుంటపల్లె, మద్దిరేవుల, రెడ్డివారి పల్లె, బాటమాదిగపల్లె, కొత్తపల్లె, చౌటపల్లె తో పాటు, లక్కిరెడ్డిపల్లె కోర్టు వద్ద ఏర్పాటు చేసిన 1.25 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీరు నింపి లక్కిరెడ్డిపల్లె, చింత కుంట పల్లె గ్రామాలకు నీరు అందించాలని ఎస్టిమేషన్లు వేసింది. అయితే ఈ ఎస్టిమేషన్లు ఫలించలేదు. రవీంద్రనగర్ వద్ద ఏర్పాటు చేసిన సంపు ద్వారా రవీంద్రనగర్, చౌటపల్లె, కొత్తపల్లె గ్రామాలకు వారానికి రెండు సార్లు మాత్రమే నీరు అందు తోంది. అనంతపురం హరిజనవాడ, గంగమ్మజాతర వడ్డెపల్లె, ఈడిగపల్లె, బాటమాదిగపల్లె, మద్దిరేవుల హరిజనవాడలకు మాత్రం నీరు అందడంలేదు. అప్పట్లో అనంతపురం హరిజనవాడలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ ను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించినా, అందులో నీరు మాత్రం నింపలేదు. ప్రతిసారీ ఎన్నికల ముందు రాజకీయ నాయకులు రోళ్లమడుగు నీరు అంది స్తామని చెబుతున్నారే తప్ప అమలు చేసింది లేదు.. ఈ ఏడాది నిన్నమొన్నటిదాకా వర్షాలే కురవక పోవడంతో చెరువులు, బావులు, బోర్లు ఎండిపోయాయి. అనంతపురం వడ్డెపల్లె, హరిజన వాడ, ఈడిగపల్లెకు పైపులైను వేసి రోళ్ల మడుగు నీరందించేందుకు రూ.7 లక్షలు మంజూరైనా పనులు ముందుకు సాగలేదు. లక్కిరెడ్డిపల్లె కోర్టు వద్ద ఉన్న ఓవర్ ట్యాంక్‌కు నీరు అందిన దాఖలాలు లేవు ఇప్పటికైనా అధికారులు స్పందించి రోళ్ల మడుగు నీటిని అన్ని గ్రామాలకు అందించాలని ప్రజలకు కోరుతున్నారు

శాశ్వత పరిష్కారం చూపండి



ఐదేళ్లుగా ఊరిలో తాగునీటి సమస్య ఉంది. బోర్లు వేసినా నీరు పడడంలేదు. దీంతో వ్యవసాయబోర్లను ఆశ్రయిస్తున్నాం. ఎన్నికల ముందు మంత్రి రాంప్రసాదురెడ్డి సొంత నిధులతో బోర్లు వేసినా నీరు పడలేదు. రోళ్లమడుగు నీటిని గ్రామానికి అందిస్తే తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది.

- వెంకటలక్షుమ్మ జే వడ్డెపల్లె పందిళ్లపల్లె

లక్కిరెడ్డిపల్లె వరకు నీరు

2012లో రూ. 53 కోట్లు మంజూరు కాగా, 30 కోట్లతో ఒక విడత పనులు ప్రారంభించారు. రెండవ విడతలో నిధులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఈ ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేస్తే లక్కిరెడ్డిపల్లెతో పాటు 24 పంచాయతీలకు రోళ్లమడుగు నీరు అందిస్తాం

- కిషోర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


మాట్లాడుతున్న అంగన్వాడీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ

రాయచోటిటౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో విడుదల చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సరోజమ్మ అధ్యక్షతన అసోసియేషన్ అంగన్వాడీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వీసులో చనిపోయిన అంగన్వాడీ వర్కర్ల దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంలో ప్రాధాన్యం ఇవ్వాలని, సమ్మె కాలంలో చనిపోయిన వారికి కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించి సమ్మె కాలంలో పెట్టిన కేసులన్నీ రద్దు చేయాలని కోరారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు చేస్తున్న 4 యాప్‌లను ఒకే యాప్‌గా మార్చాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు రెగ్యులర్‌గా సరఫరా చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. త్వరలో జరగబోయే రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో అంగన్వాడీల సమస్యలపై చర్చించి గత సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని ఆ మేరకు జీవో కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు మంజుల, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రామకృష్ణ, సాంబశివ, ఉపాధ్యక్షు లు పీఎల్ నరసింహులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ లీడర్లు నాగేశ్వరి, సరోజమ్మ, సుజాత, అనురాధ, దుర్గా, విజయకుమారి, భారతి, రమణమ్మ, సీతా తదితరులు పాల్గొన్నారు.

దుస్థితిలో క్రీడా మైదానం

- నడిచేందుకూ కష్టమే..


క్రీడా మైదానంలో అడ్డంగా వేసిన కంకర

రాజంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం నడిచేందుకు సైతం వీలు లేకుండా మారింది. సుమారు 15 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ క్రీడా మైదానంలో తరచూ క్రీడా పోటీలు నిర్వహిస్తుంటారు. తెల్లవారు జాము 4 గంటల నుంచే వందలాది మంది మార్నింగ్‌వాక్ చేస్తుంటారు. గత ఎన్నికల సమయంలో ఈ మైదానంలోనే హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి హెలిప్యాడ్ నుంచి ప్రచార వేదికవద్దకు వెళ్లేందుకు వీలుగా కంకర వేసి తాత్కాలికంగా రోడ్డు వేశారు. ఇప్పటి వరకు ఆ కంకరను తొలగించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మైదానంలో శాప్ ఆధ్వర్యంలో వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేశారు. ఆ ట్రాక్ నాసి రకంగా ఉండడంతో పాదచారులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రౌండ్ చుట్టూ పాదచారులు నడిచేచోట వారు కూడా కంకర వేసి, దానిపై మట్టి వేయకపోవడంతో కంకరరాళ్లు బూట్లకు, చెప్పులకు గుచ్చుకుంటున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. కంకరను తొలగించడం, లేదంటే కంకరపై మట్టి వేసి క్రీడాకారులకు, పాదచారులకు ఇబ్బంది లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

'విద్య ప్రైవేటీకరణపై ఉద్యమించండి'

రాయచోటిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కషాయీకరణకు వ్యతిరేకం గా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలనిఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పసుపు లేటి కోటేశ్వరరావు పిలుపుని చ్చారు. ఆదివారం రాయ చోటి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య 49వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలను విజయనగరం వేదిక కానుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారానికి సమష్టిగా ఉద్యమించాలన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, మాధవ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హాస్టల్ విద్యార్థుల సమస్య లను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసింద న్నారు. జైలు జీవితాలు అనుభవిస్తున్న ఖైదీలకు రోజుకు నూరు రూపాయలు పైగా కేటాయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులకు కేవలం రూ.52 మాత్రమే కేటాయించడం బాధాకరమన్నారు.

రక్తదాన శిబిరం

రాయచోటిటౌన్, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మేనల్లుడు, మౌర్యరెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రక్తదానం చేసినవారి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. మంత్రి సతీమణి హరితమ్మ, సోదరి శ్రీలతమ్మ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి మాలధారులకు అన్నదానం

సుండుపల్లె, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విరూపాక్ష, చెన్న కేశవస్వామి ఆలయంలో అయ్యప్ప, గోవింద మాల ధరించినవారికి సోమవారం నుంచి మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాదం ఏర్పాటు చేస్తారని తెలియజేశారు. దాత అయ్యప్ప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జనవరి 4వ తేదీ వరకు ఉంటుందని, గోవింద, అయ్యప్ప దీక్ష పాటించిన భక్తులందరూ భిక్ష స్వీకరించాలని కోరారు

గంగమ్మకు బోనాలు

సుండుపల్లె, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం గ్రామస్తులు బోనాలు సమర్పించారు. మండలంలోని పెద్దినేనికాలువ కాలువ గ్రామ పంచాయతీ బూడిదేటిపల్లి సమీపంలోని ఆలయంలో మూడు రోజులుగా పూజలు, హోమాలు చేశారు. శనివారం తిరుణాల ముగియడంతో ఆదివారం గ్రామస్తులు బోనాలు సమర్పించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టర్), అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 21న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కృష్ణారెడ్డి చెరువులోకి వర్షపు నీరు


చెరువులోకి చేరిన వర్షపు నీరు

సుండుపల్లె,అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): మడితాడు గ్రామ పంచాయతీలో ఉన్న కృష్ణారెడ్డి చెరువుకు వర్షపు నీరు చేరుతోంది. 5 రోజుల నుంచి వర్షం మండలంలో కురుస్తుండడంతో అటవీ ప్రాంతం నుంచి నీరు వస్తోంది. కృష్ణారెడ్డి చెరువు నిండితే సుమారు 500 ఎకరాలకు సాగు నీటి కొరత తీరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండేళ్ల తర్వాత చెరువు నిండే అవకాశాలు కనిపిస్తున్నాయని స్థానిక రైతులు చెబుతున్నారు.

జూదరుల అరెస్టు

సంబేపల్లె, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిన్నెమీదపల్లి సమీపంలో నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై ఆదివారం దాడి చేసి 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. వారి నుంచి రూ.4,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మట్కా, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

ఒంటిమిట్ట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, 47 సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శివప్రసాద్ రెడ్డి తెలిపారు. చింతరాజుపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి మండపం పల్లికి చెందిన ఓబులేసు అనే వ్యక్తిని అరెస్టు చేసి 25 సీసాలు,స్వాధీనం చేసుకున్నామన్నారు. రాచపల్లికి చెందిన సుంకేసుల మరాఠీ వద్ద 22 సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సీసీ రోడ్లతో గ్రామాలకు మహర్దశ


సిద్దవాండ్లపల్లెలో సిమెంట్ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

పుల్లంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేస్తున్నామని, దీంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఆయన అనంత సముద్రం పంచాయతీ సిద్దారెడ్డి పల్లె పాపక్కగారిపల్లె, పుల్లారెడ్డిపల్లెల్లో 30 లక్షల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. పీవీజీపల్లె పంచాయతి కొండంపల్లిలో ఎంపీడీవో జయశ్రీ సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్కా సాయివికాస్ రెడ్డి, ముద్దా గంగిరెడ్డి, కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, కేవీఎస్ యాదవ్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి ఉత్సవాల్లో మంత్రి సతీమణి


చౌడేశ్వరిజ్యోతి ఉత్సవాల్లో హరితమ్మ

చిన్నమండెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురంలో శనివారం రాత్రి నిర్వహించిన చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి ఉత్సవాల్లో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి సతీమణి హరిత పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేదపండితులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈమె వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామంలోని మహిళలు సామూహికంగా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా జగన్‌మోహన్‌రాజు జన్మదిన వేడుకలు


చమర్తిని సన్మానిస్తున్న కొమరా వెంకటనరసయ్య తదితరులు

రాజంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో ఆదివారం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టి భారీ గజమాలలు, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఒంటిమిట్ట మండల టీడీపీ నాయకులు, మాజీ కల్లుగీత కార్పొరేషన్ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య కూండ్ల హరినాథ్‌రెడ్డి, శివారెడ్డి, రాజంపేట మండల మాజీ మండల ఉపాధ్యక్షుడు రామనరసింహులు, రాజంపేట మండల టీడీపీ సీనియర్ నాయకులు కూచివారిపల్లె వెంకటయ్యనాయుడు, మండల మాజీ ఉపాధ్యక్షుడు బావనయ్యనాయుడు, కూచివారిపల్లె మాజీ ఉపసర్పంచ్ అజయ్, టెక్నోమో మల్లికార్జుననాయుడులతో పాటు రాజంపేట, ఒంటిమిట్ట తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: కోదండరామాలయం వెనుకభాగంలో టీడీపీ సీనియర్ నాయకులు కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో పెద్దఎత్తున టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు.

'కాపుల ఐక్యత కోసమే బలిజ వన భోజనాలు'


సమావేశం లో మాట్లాడుతున్న కాపు నాయకుడు పోతురాజు నవీన్

రైల్వేకోడూరు, అక్టోబరు 20: (ఆంధ్రజ్యోతి) కాపుల ఐక్యతను చాటుకునేందుకు ప్రతి ఏటా బలిజ వనభోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కాపు నాయకుడు పోతురాజు నవీన్ తెలిపారు. ఆదివారం బలిజ వన భోజన కార్యక్రమంపై రైల్వే కోడూరులోని ఉంగరాల కృష్ణ మామిడి తోటలో నియోజకవర్గంలోని కాపు నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 18న ఓబుల వారిపల్లె మండలంలో బలిజ వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలోనే కాపులకు రిజర్వేషన్ అమలు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపునాడు ప్రధాన కార్యదర్శి కటికం సుబ్రహ్మణ్యం, కాపు నాయకులు ఉత్తరాది శివకుమార్, నార్జాల హేమరాజ్, మందల నాగేంద్ర, చెన్నంశెట్టి రమేష్, మల్లెం హేమంత్, పోతురాజు సుమన్, గుగ్గిళ్ల సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ శివయ్య, శోడిశెట్టి భాస్కర్, నార్జాల దాసరథి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న పండుగోల మణి

రైల్వేకోడూరు, అక్టోబరు 20: (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరులోని రైల్వేస్టేషన్ రూటులో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు గుడి, బడి దగ్గరగా ఉన్నాయని దీంతో విద్యార్థులు, మహిళలు తదిత రులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు తాగుబోతుల వీరంగం చూడలేక ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను వెంటనే ఎత్తివేయాలని సోమవారం ధర్మపోరాటం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్, సహాయ కార్యదర్శి క్రిష్ణచైతన్య, నాయకులు మేకల రమణయ్య, వెంకటరమణ, వెంకటరమణ, మొండి రాజేశ్వరి పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నూర్ బాషా సంఘం సభ్యులు

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థినికి నిప్పంటించి హతమార్చిన దాసరి విఘ్నేశ్‌ను కఠినంగా శిక్షించాలని రైల్వేకోడూరు నూర్ బాషా సంఘం అధ్యక్షుడు బోధనపు మహబూబ్ బాషా డిమాండ్ చేశారు. పట్టణంలోని నూర్ బాషా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాటాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిందితుడిని పట్టుకోవడం అభినందనీయమని తెలిపారు. భవిష్యతులో ప్రేమోన్మాదులందరికీ గుర్తుండే విధంగా అతడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూర్ బాషా సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

11 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, అక్టోబరు 20: మండల పరిధిలోని చెన్నముక్కపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 35 మందికి పరీక్షలు నిర్వహించి అర్హులైన 11 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మందికి పరీక్షలు నిర్వహించి మందులు, అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రైతు మృతి

● మరో ఇద్దరికి గాయాలు

● మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి



నాగరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గుట్టలపై పంచాయతీ నడింపల్లెలో పొలంలో పిడుగు పడడంతో నాగరాజు(43) మృతి చెందాడు. అతని భార్య పార్వతి, తల్లి చిన్నక్కకు కూడా ఈ ఘటనలో గాయాలయ్యాయి. నాగరాజు, అతని భార్య తల్లి ముగ్గురూ కలిసి ఆదివారం మధ్యాహ్నం పొలంలో వేరుశెనగ నూర్పిళ్లు చేస్తుండగా పిడుగు పడింది. దీంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందగా పార్వతి, చిన్నక్కకు గాయాలయ్యాయి. గమనించిన తోటి రైతులు ముగ్గురినీ పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఆరా తీసిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్వతి, చిన్నక్కను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించాలని తెలియడంతో అక్కడి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి వారికి నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, సంఘం శివారెడ్డి, మహేంద్ర రెడ్డి, మహమ్మద్ పీర్, ఎన్టీఆర్ నఫీస్, గాయం వెంకటరెడ్డి, వసంతాల రాజా, ఖాదర్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన గంగాధర్, గోపి

మదనపల్లె అర్బన్, అక్టోబరు20: వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో గంగాధర్, గోపి తీవ్రంగా గాయపడిన వారిని ఆదివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఇందులో కర్ణాటక రాష్ట్రం, సోమయాజుపల్లె తాలుకా, పెగలపల్లెకు చెందిన గంగాధర్ వ్యక్తిగత పనులపై రామసముద్రం వచ్చారు. రామసముద్రం నుంచి మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యలో కాప్పల్లె వద్ద మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ముఖం, తలపై గాయాలయ్యాయి. పుంగనూరు మండలం దండుపాళ్లెం వాసి వెంకటరమణ కుమారుడు గోపి(45) ద్విచక్రవాహనంలో వెళ్లుతుండగా కొత్తయుండ్లు సమీపంలో కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనలో గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

పీఆర్‌టీయూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

రాయచోటిటౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి డైట్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా కృష్ణయ్య, గిరిప్రసాద్ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా మూడే సూర్యుడునాయక్, ప్రధాన కార్యదర్శిగా ఉమామహేశ్వర్, జిల్లా గౌరవాధ్యక్షుడిగా అహమ్మద్‌బాషాను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ యూనియన్ ఎనలేని పోరాటాలు చేసిందన్నారు. జిల్లా నూతన కమిటీ సభ్యులు భవిష్యత్తులో ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయడం ద్వారా యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 12వ పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ గుజ్జల తిరుపాల్, పీఆర్‌టీయూ వైఎస్ఆర్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకటశివారెడ్డి, రాష్ట్ర నేతలు మల్లికార్జునరెడ్డి, టీఎల్ నరసారెడ్డి, సాహిబ్‌జాన్, కేఎస్‌జాకీర్ హుస్సేన్, సిద్ధూనాయక్, సురేశ్, హుస్సేన్‌బాషా, మల్లికార్జునరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు, పీఆర్‌టీయూ మండల, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, సంఘ శ్రేయోభిలాషులు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో పోలీసుల తనిఖీ

● అప్రమత్తమైన వ్యాపారులు



మార్కెట్ వీధిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

జమ్మలమడుగు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, సిబ్బంది పట్టణంలోని పలు వీధుల్లో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఆదివారం రాత్రి 7 గంటల నుంచి ఏకకాలంలో పాత బస్టాండులోని ముద్దనూరు రోడ్డు లాడ్జీలు, వివిధ దుకాణాలు తనిఖీ చేపట్టారు. అర్బన్ సీఐ లింగప్ప, ఎస్‌ఐలు రామక్రిష్ణ, కల్పన, ప్రొద్దుటూరు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసులు, ప్రొద్దుటూరు టుటౌన్ ఎస్‌ఐ ధనుంజయుడు, మరో 30 మంది కానిస్టేబుళ్లు తనిఖీ చేశారు. కూరగాయల మార్కెట్‌వీధిలో ఓ దుకాణం వద్ద పోలీసులు సుమారు అరగంటపాటు వేచి చూశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు బంధువుల దుకాణాల యజమానులకు అప్రమత్తం చేసినట్లు తెలిసింది. ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీ చేపట్టినట్లు పోలీసు సిబ్బంది ద్వారా తెలిసింది. పట్టణంలోని ట్రాన్స్‌పోర్టు ఆఫీసులు, లాడ్జీలు లైసెన్సులేని క్రాకర్స్ విక్రయించే దుకాణాలను తనిఖీ చేపట్టారు. పెద్దపసుపుల రోడ్డులో ఈకార్ట్ లాజిస్టిక్స్ దుకాణం, టీచర్స్ కాలనీలో తనిఖీ చేపట్టారు. పట్టణంలో పోలీసులు సంచరించడంతో అక్రమ వ్యాపారాలు చేసే కొందరు అప్రమత్తమైనట్లు తెలిసింది. కొందరు రాజకీయ నేతలు పోలీసు అధికారులకు ఫోన్లు కూడా చేసి సమాచారం అడిగినట్లు తెలిసింది. ఏదేమైనా లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సమాచారం. పట్టణంలో సాయంత్రం నుంచి రాత్రి 9.30 గంటల వరకు పోలీసు అధికారులు, సిబ్బంది పట్టణంలో జల్లెడ పట్టారు. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, తదితర గ్రామాల్లో కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్ సమస్యలు, విద్యార్థినులపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి చర్యలు చేపట్టాలని, ఎక్కడైనా పాఠశాల, కళాశాలలకు బయట వెళ్లేవారి మహిళా విద్యార్థినులపై పోకిరి వారు పెట్టే ఇబ్బందులకు పోలీసులు విచారించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.



ప్రకృతి వ్యవసాయం - రైతుకు ఆదాయం

● 15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం

● ప్రకృతి వ్యవసాయ పాఠశాలతో రైతులకు సలహాలు

● ఐదంచెల సేద్యంతో అధిక లాభాలు : ఆదర్శ రైతు

నిమ్మనపల్లి, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో ఆరితేరాడు. 15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ తాను లాభాలు పొందడమే కాకుండా ప్రకృతి వ్యవసాయ పాఠశాల ద్వారా మరింత మంది రైతులకు సలహాలు ఇస్తూ వారిని కూడా ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తవలం పంచాయతీ చౌకిళ్లవారిపల్లె రైతు గుమ్మడి గంగులప్ప సామాన్య రైతు కటుంబీకుడు. ప్రకృతి వ్యవసాయం ఆద్యుడు డాక్టర్ సుభాష్‌పాలేకర్‌ను సైతం గంగులప్ప చేస్తున్న వ్యవసాయం నిమ్మనపల్లికి రప్పించింది. ఒక ఆవుతో 30 ఎకరాలు సాగు చేయవచ్చని నిరూపించాడు. వివరాల్లోకెళితే....

చౌకిళ్లవారిపల్లె రైతు గుమ్మడి గంగులప్ప సామాన్య రైతు కటుంబీకుడు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టినిలిపి ప్రకృతి వ్యవసాయంతో తాను లాభాలు పొందడమే మరింత మంది రైతులకు సలహాలు ఇస్తూ వారిని కూడా ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. బెంగళూరుకు చెందిన సురేష్ అనే రైతు తనతో మాట్లాడుతూ ఒక ఆవుతో 30 ఎకరాలు సాగు చేయవచ్చన్నారు. దీంతో ప్రకృతి వ్యవసాయంపై మక్కువతో అతడి సలహాలు తీసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాడు. అనంతరం ప్రకృతి వ్యవసాయ వైద్య విజ్ఞాన కేంద్రం పేరుతో జీవరక్షణ, గోసంరక్షణతో రిజిస్ట్రేషన్ చేసి ప్రకృతి వ్యవసాయ పాఠశాలను ప్రారంభించాడు. ప్రస్తుతం వ్యవసాయ పొలంలో ప్రకృతి నర్సరీని ఏర్పాటు చేసి వాటి ద్వారా నారును రైతులకు అందిస్తూ తాను కూడా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాడు. రైతు గంగులప్ప ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రస్తుతం క్రిమి సంహారక మందుతో పండించే పంటల ద్వారా మానవాళికి ముప్పు ఏర్పడిందని తెలిపారు. ఫలితంగా స్వచ్ఛమైన ప్రకృతి వ్యవసాయంతో కూరగాయలు పండిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మామిడి తోటలో అంతర పంటగా మిరప, టమాట, వంగ, బీర, కాకర, బెండ, పసుపు, అనప, గుమ్మడి, అరటి, మునగ, హర్యానా సొద్దల పంటను పండిస్తున్నట్లు తెలిపారు. తనకు ఉన్న 5 ఆవుల్లో పుంగనూరు, ఒంగోలు జాతికి చెందిన ఆవులు ఉండగా వాటి ద్వారా పేడను సేకరించి పంటకు వాడుతున్నట్లు తెలిపారు. ఈ పంటలను కేవలం ఆవు నుంచి సేకరించిన పేడ ద్వారా జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసి మజ్జిగ వంటివి వేసి పంటకు వేస్తానని తెలి పారు. అలాగే నర్సరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని రకాల కూరగాయలు ఎకరాకు 10 టన్నులు పండిస్తున్నట్లు తెలిపారు. మార్కెటింగ్ సక్రమంగా ఉంటే లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. అంతేకాకుండా పలువురు రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి సలహాలు, సూచనలు కావాలంటే 9059125954 ను సంప్రదించాలని తెలిపారు.

ఐదంచెల విధానంతో అధిక లాభాలు

ఐదంచెల విధానం అనగా ఒకటి.. భూమిలోపల పండే గడ్డజాతి ముల్లంగి, బంగాళదుంప, రెండోది మిరప వంగ, మూడోది బీర కాకర, పొట్ల, నాలుగోది జామ, సపోట దానిమ్మ, బొప్పాయి, అరటి, మునగ ఐదోది శాశ్వత పంటలు అల్లనేరేడు మామిడి, కొబ్బరి ద్వారా అధిక లాభాలు సాధించ వచ్చని తెలిపారు.

సుభాష్ పాలేకర్‌ను పల్లెకు రప్పించిన రైతు

గంగులప్ప చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని చూసేందుకు డాక్టర్ సుభాష్‌పాలేకర్ నిమ్మనపల్లిలోని చౌకిళ్లవారిపల్లికి వచ్చి ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించి ప్రశంసించారు. 2016 హైదరాబాద్‌లో వెంకయ్యనాయుడు ద్వారా ఉత్తమ రైతు ప్రశంసా పత్రం అందుకున్న ఘనత గంగులప్పది.



ప్రకృతి వ్యవసాయంతో పండించిన అరటి



ఏపుగా పెరిగిన మునగచెట్టు మాపుతున్న రైతు గంగులప్ప



గంగులప్ప ప్రారంభించిన నర్సరీ



సలాం పోలీస్

● నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

● 31 వరకూ జిల్లాలో వారోత్సవాలు

● కలికిరి సీఆర్పీఎఫ్‌లో సద్భావనా దివస్ పేరుతో నేడు ప్రత్యేక కార్యక్రమాలు





కలికిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ కోసం నిరంతరం రేయింబవళ్లు కష్టించే పోలీసులకు సలాం పెట్టాలి. శెలవనే ప్రశ్న తలెత్తని ఉద్యోగం వారిది. 24 గంటలూ సేవలు చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా వదిలేసిన అమరులకు పాదాభివందనం చేయాలి. అక్టోబరు 21 నుంచి అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడానికి జిల్లా పోలీసులు సమయాత్తమవుతున్నారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని పదిరోజులకు సరిపడా కార్యక్రమాలను రూపొందించారు. జిల్లాలో అమరవీరులను గుర్తించడం, వారికి శాశ్వత గుర్తింపుగా వీధులు, తదితర వాటికి వారి పేర్లు పెట్టడం, అమర వీరులు చదివిన పాఠశాలల్లో వారి ఫొటోలు పెట్టడం, చివరిరోజు వారి తల్లిదండ్రులను సన్మానించడం, 31న జిల్లా వ్యాప్తంగా యూనిటీ రన్, సమైక్యతా దినం నిర్వహణ, క్యాండిల్ ర్యాలీలు కార్యక్రమాలను రూపొందించారు.

సీఆర్పీఎఫ్‌కు పెను సవాళ్లు

1959 అక్టోబరు 21న అనూహ్యంగా మొదటిసారి చైనా నుంచి ఎదురు దెబ్బ తగిలి 10 మంది సహచరులను కోల్పోవడంతో సీఆర్పీ పేరు సహా సీఆర్పీఎఫ్‌గా తన దిశను మార్చుకోవలసి వచ్చింది. శత్రు దేశాలపై పోరాటాలకు పరిమితమైన సీఆర్పీ పేరు మార్చుకుని దేశ అంతర్గత భద్రతను సవాలుగా తీసుకుంది. దేశంలో ఎక్కడ బాంబుల మోత, తుపాకీల శబ్దం వినిపించినా వాటిని ఎదుర్కోవడానికి సీఆర్పీఎఫ్ సిద్ధంగా ఉంటుంది. చిన్న చిన్న అల్లర్ల అణచివేత మొదలు అత్యంత భయంకరమైన ఉగ్రవాద నిరోధం వరకూ, రాజకీయ నేతలకు భద్రత కల్పించే వరకూ శౌర్య శక్తితో ఇప్పుడు సీఆర్పీఎఫ్ దేశ వ్యాప్తంగా విస్తరించింది. సాంకేతిక, ఆయుధ సామర్థ్యం కాకుండా మూడు లక్షలకు పైగా మానవ సామర్థ్యమున్న సాయుధ బలగాల్లో ఇప్పుడు సీఆర్పీఎఫ్ ఒక్కటే అగ్రగామి.

కలికిరిలో అగ్రగామి శిక్షణ సంస్థ

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలోని వివిధ రకాల శిక్షణ సంస్థల్లో అగ్రగామిగా చెప్పుకొనే సీఐఎటీ-3 స్కూల్ కలికిరిలో నెలకొల్పారు. కలికిరికి ఐదు కిలోమీటర్ల దూరంలో పాలెంకొండ వద్ద ఏర్పాటు చేశారు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మూడింటిలో ఇది మూడోది. సీఆర్పీఎఫ్‌లో ప్రధానంగా 203 ఎక్జిక్యూటివ్ బెటాలియన్లున్నాయి. వీఐపీ సెక్యూరిటీ బెటాలియన్‌లు ఐదున్నాయి. ఆరు మహిళా బెటాలియన్లు, 15 ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బెటాలియన్‌లు, 7 సిగ్నల్ బెటాలియన్లు మరో స్పెషల్ డ్యూటీ గ్రూపు కూడా ఉంది. అంతేకాకుండా అత్యంత చురుకైన, రాటుదేలిన బెటాలియన్.. కమాండో బెటాలియన్ ఫర్ రెసల్యూట్ యాక్షన్ (కోబ్రా) అత్యంత సాహసవంతమైందే కాకుండా శక్తివంతమైంది కూడా. బెటాలియన్‌లో వివిధ కేడర్లలో 1200 మంది ఉంటారు. బెటాలియన్‌కు కమాండెంట్ నాయకత్వం వహిస్తారు. ఒక బెటాలియన్ ఏడు కంపెనీలుగా ఉంటుంది. ఒక్కో కంపెనీకి ఒక అసిస్టెంట్ కమాండెంట్ సారథ్యం వహిస్తారు. ఇదంతా ఒక ఎత్తయితే బెటాలియన్ దళాలను సర్వసన్నద్ధులుగా తయారు చేయడానికి అనేక స్థాయిల్లో శిక్షణా కేంద్రాలు నిరంతరం పని చేస్తుంటాయి. దేశంలో మూడు ప్రత్యేక శిక్షణ కేంద్రాలున్నాయి. సీఐఏటీ (కౌంటర్ ఇన్‌సర్జన్సీ అండ్ యాంటీ టెర్రరిజమ్) ఉగ్రవాద నిర్మూలన, తీవ్రవాద నిరోధక శిక్షణ సంస్థ. ఇవి దేశంలో సిల్‌చార్ (అస్సాం)లో ఒకటి, శివపురి (మధ్యప్రదేశ్) మరొకటి వుండగా మూడోది దక్షిణాది కలికిరిలో ఉంది. సీఆర్పీఎఫ్ ప్రాంగణంలోనే ఉన్న ఈ సీఐఏటీ-3 శిక్షణ అత్యంత సున్నితమైంది, మరింత కఠోరమైనదిగా చెబుతారు. శిక్షణ పూర్తయిన అనంతరం నిగ్గుదేలిన వారిని ప్రత్యేకంగా ఎంపిక చేసి చివరగా సీఐఏటీలో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో తిరిగి రకరకాల విభాగాల్లో నిష్ణాతుల్ని చేయడానికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

సీఐఏటీ శిక్షణలో నిష్ణాతులు

అనేక రకాల పోరాట పటిమల్లో ఆరితేరిన వారికి కలికిరి సీఐఏటీలో శిక్షణ ఇస్తున్నారు. 175 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నెలకొల్పారు. పాలెంకొండ దిగువన దాని చుట్టూ సీఆర్పీఎఫ్ సహా 53వ ఐటీబీపీ, 65 వ బీఎస్ఎఫ్ బెటాలియన్‌లు కూడా ఉన్నాయి. 169 ఎకరాల్లో ప్రత్యేకంగా ఫైరింగ్ రేంజి ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా పది పడకల ఆస్పత్రి కూడా వుంది. శిక్షణ పొందే వారికి కాకుండా శిక్షణ అందజేసేందుకు ఉన్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి 180 కుటుంబాలకు వసతి సముదాయాలున్నాయి. సీఐఏటీ డీఐజీగా అనుపమ్ శర్మ పనిచేస్తున్నారు. ఇద్దరు కమాండెంట్లు, ఒక సెకండ్ ఇన్ కమాండెంట్, ఐదుగురు డిప్యూటీ కమాండెంట్లు, ఐదుగురు అసిస్టెంట్ కమాండెంట్లు, 15 మంది ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు ఎస్‌ఐలు, 10 మంది ఏఎస్‌ఐలు, 150 మంది హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు ఉన్నారు. ఇక 4 నుంచి 6 లేక 9 వారాల పాటు శిక్షణ పొందే వారు బ్యాచ్‌లుగా వచ్చి శిక్షణ పూర్తయ్యాక వెళుతూ వుంటారు.



కలికిరి సీఆర్పీఎఫ్ సింహద్వారం

సంస్మరణ దినం ప్రత్యేకత

అమర వీరుల సంస్మరణ దినం సీఆర్పీఎఫ్‌కు ఎంతో ప్రత్యేకమైంది. ఏటా ప్రాంగణలో అనేక ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సీఆర్ఎఫ్ సాహస కృత్యాల ఫలితంగానే ఈ ప్రత్యేకమైన దినం ఏర్పాటైందని ఘనంగా చెబుతుంటారు. ఉదయం నుంచి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించడం, డీఐజీ భావోద్వేగ సందేశాలతో కూడిన ప్రసంగాలు, కుటుంబాలతో కలిసి ఆటల పోటీలు, రాత్రంతా సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతుల పంపిణీ, ప్రత్యేక విందులు ఏర్పాటు చేస్తారు. సీఐఏటీ ప్రత్యేకత దృష్ట్యా సీఆర్పీఎఫ్ డీజీపీ కూడా తరచూ హాజరవడం రివాజు.

210లీటర్లు నాటుసారా సీజ్ - ఒకరి అరెస్ట్



నాటుసారా, నిందితుడితో ఎస్ఐ శ్రీహరి

వాల్మీకిపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గండబోయనపల్లెలో ఆదివారం విస్తృత దాడులు చేసి 210 లీటర్ల నాటుసారా సీజ్ చేసి గురునాథ్‌ను అరెస్టు చేశారని ఎస్ఐ శ్రీహరి తెలిపారు. కొండకింద మేకలవారిపల్లె అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ బట్టీలపై దాడులు చేశారన్నారు. బట్టీలు, 5వేల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. 210లీటర్ల నాటుసారా సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేయగా రెడ్డెప్ప, నాగరాజు పరారయ్యారన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది దస్తగిరి, వెంకటేష్, గంగరాజు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ లక్ష్యం

● నాణేలు సేకరణలో వసీమా అస్లాం ● ఇప్పటికే 30 దేశాల నాణేలు, నోట్లు, మెడల్స్ సేకరణ

రైల్వేకోడూరు, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్‌లో పేరు సంపాదించాలన్న లక్ష్యంతో ఓ యువకుడు దేశ విదేశాలకు చెందిన అనేక నాణేలను సేకరిస్తున్నాడు.

రైల్వేకోడూరు వాసి వసీమాఅస్లాం బీటెక్ చదివాడు. తండ్రి నడుపుతున్న హోటల్‌లో చేదోడువాదోడుగా ఉంటూనే వివిధ దేశాలకు చెందిన నాణేలు, నోట్లు, మెడల్స్ తదితరాలను సేకరిస్తున్నాడు. క్రీస్తు పూర్వం 200, 300 ఏళ్ల నాటి నాణేలు, మౌర్యులు, శాతవాహనులు, చోళులు, మట్లిరాజులు, నిజాం నవాబులు, ఢిల్లీ సుల్తాన్ కాలంలో చలామణిలో ఉన్న నాణేలు, ఇండియా, దుబాయ్, కువైట్, కత్తర్, సౌదీ, బెహరిన్, పాకిస్తాన్, కెనడా, సింగపూర్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, లండన్, రష్యా, చైనా, యూరప్ తదితర దేశాల్లో వివిధ కాలాల్లో చలామణిలో ఉన్న నాణేలు, కరెన్సీ, ప్రపంచ యుద్ధంలో సైనికులకు ఇచ్చిన పతకాలు సేకరించాడు. ఇప్పటి వరకూ 75,250 నాణేలు సేకరించినట్లు ఆయన చెబుతున్నాడు. వీటితో పాటు కొలంబియాలో పాతకాలం నాటి గ్రామ్ ఫోన్ రికార్డులు, పెన్నులు తదితరాలను కూడా సేకరించాడు. చిన్నతనం నుంచే నాణేలు తదితరాల సేకరణ అలవాటుగా మార్చుకున్న అస్లాం వద్ద ప్రస్తుతం భారత దేశానికి చెందిన నాణేలు, స్వాతంత్ర్యం నాటి నుంచి మనుగడలో ఉన్న ఉన్న నాణేలు కూడా ఉన్నాయి. సేకరించిన నాణేలు, కరెన్సీ తదితరాలను పలు ప్రాంతాల్లో, ప్రదర్శిస్తూ చరిత్రపై అవగాహన కల్పిస్తున్నాడు.

గిన్నిస్‌బుక్‌లో స్థానం కోసం శ్రమిస్తున్నా



నాణేలు, కరెన్సీలు, మెడల్స్ సేకరణతో గిన్నిస్ బుక్ రికార్డును సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. చిన్నతనంలోనే నాణేలు, కరెన్సీలు సేకరించాలని భావించాను. దీనినే లక్ష్యంగా కృషి చేస్తున్నా. లిమ్కాబుక్ రికార్డు బ్రేక్ చేసేందుకు అవసరమైనన్ని నాణేలు సేకరించా. గిన్నిస్‌బుక్‌లో స్థానం కోసం నాణేలు సేకరించాల్సి ఉంది.

- వసీమా అస్లాం, రైల్వేకోడూరు



వివిధ రకాల విదేశీ కరెన్సీ



గ్రామ్‌ఫోన్ రికార్డ్, ఇండియన్ కరెన్సీ



నవానగర్, ఢిల్లీ సుల్తాన్‌కు చెందిన నాణేలు

నిజాం పాలనలో వెండి నాణేలు



విజయనగర పాలనలో ఉన్న బంగారు నాణేలు

శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో 1,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి 26 వరకు రెసిడెన్షియల్ పద్ధతిలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం వల్ల వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు, బాలింతలు, చిన్న పిల్లల తల్లిదండ్రులు, బాధ్యతలు చూసుకోవాల్సిన ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక వత్తిడికి గరవుతున్నారన్నారు. పాఠశాల పనివేళల్లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టడం వల్ల ప్రభుత్వ పాఠశాల్లో విద్యాబోధనకు తీవ్ర అంతరాయం కలుగుతుందని.. వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, రామచంద్రరెడ్డి, మణికుమార్, మస్తాన్‌బాబు పాల్గొన్నారు.

పుష్పగిరి క్షేత్రంలో హైకోర్టు జడ్జి



వల్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పుష్పగిరి క్షేత్రంలో ఆదివారం హైకోర్టు జడ్జి కృష్ణమోహన్ శ్రీకామాక్షి సమేత వైద్యనాధున్ని దర్శించుకున్నారు. ఈసందర్భంగా జడ్జికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కామాక్షి సమేత వైద్యనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జి పుష్పగిరి మఠం చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన పుష్ప గిరి క్షేత్రాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తహసీల్దారు శ్రీవాణి, స్థానిక అధికారులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు బయలుదేరిన ఆశాలు


కడప రైల్వేస్టేషన్‌లో ఆశా కార్యకర్తలు

కడప (మారుతీనగర్), అక్టోబర్ 20: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న తలపెట్టిన చలో విజయవాడ (మహాధర్నా) కార్యక్రమానికి ఆదివారం పెద్ద ఎత్తున ఆశా కార్యకర్తలు కడప రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి పలు ఉద్యమాలు చేసినప్పటికీ ప్రభుత్వాలు స్పందించ లేదన్నారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మంత్రులకు , అధికారులకు అనేక మార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఇంతవరకూ అతీగతీ లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి తమకు ఇచ్చిన హామీలు త్వరితగతిన నెరవేర్చాలని కోరారు. లేదంటే సమరశీల పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మ, ఉపాధ్యక్షురాలు అనసూయ, అమ్ములు, దేవి నారాయణమ్మ, రాజేశ్వరి, ముకుంద, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని హత్య చేసిన నిందితున్ని ఉరి తీయాలి : ఆర్‌ఎస్ యూ



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఆర్‌ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో బాలికపై అత్యాచారం చేసి నిప్పంటించి ఆ మె మృతికి కారణమైన నిందితున్ని ఉరి తీయాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ప్రభుత్వ బాలుర బీసీ వసతిగృహంలో ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జీవితంపై ఎన్నో ఆశలతో కష్టపడి చదువుకుంటున్న బాలికపై స్నేహితుడి ముసుగులో విఘ్నేశ్ దారుణానికి పాల్పడ్డాడని, ఇది చాలా దారుణమని అన్నారు. తనకు వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యు నాయకులు కొండేటి, వెంకటేశ్, ధనుంజయ్, సాయికుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డయల్ 100, 112 సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ

కడప క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు హెల్ప్‌లైన్ నంబర్లు డయల్ 100, 112 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాలో పై నెంబర్లు పనిచేయడం లేదంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని, రెండూ పోలీసు హెల్ప్‌లైను నెంబర్లు యదావిధిగా పనిచేస్తున్నాయని ఎస్పీ తెలిపారు.

మండలి బుద్ధప్రసాద్‌ను కలిసిన హరిప్రసాద్


మండలి బుద్దప్రసాద్‌ను సత్కరిస్తున్న హరిప్రసాద్ తదితరులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. మైదుకూరు జనసేన నాయకులు లక్ష్మీభరత్, పసుపులేటి నాగమల్లిఖార్జున్ పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం... దెబ్బతిన్న పంటలు


నర్సనపల్లెవద్ద వర్షానికి నిలువునా చనిపోతున్న మిరప


ఇటుకులపాడువద్ద నేలకు వాలిపోయిన వరిని చూపుతున్న మహిళ


గంగనపల్లెవద్ద పొలాలల్లో కుళ్లిన మినుము కుప్పలు

కాశినాయన, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షం రైతన్నకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ప్రకృతి ప్రకోపానికి పంటలు సాగుచేసిన రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో గత రెండు మూడురోజులుగా కురి సిన ఎడతెరిపిలేని వర్షాలకు చేతికి అందివచ్చిన వరి, మినుము, ఉల్లి, మిరప లాంటి అనేక పంట లు దెబ్బతిన్నాయి. ఇటుకులపాడు , రామచంద్రా పురం తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన దాదాపు 50 ఎకరాల్లో వరి పంట కిందపడి పోయి ధాన్యం మొలకలు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సాపురం, మూలపల్లె, నరసన్నపల్లె తదితర గ్రామల్లో నీరు ఎక్కువై మిరప చేలు నిలు వునా చనిపోతున్నాయి. గంగనపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలో కోసి కుప్పలు వేసిన మినుము పంట ఎడతెరిపి లేని వర్షంతో కుళ్లిపోయింది. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంటలు కళ్లముందే వర్షానికి దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈవిష యంపై మండల వ్యవసాయాధికారి జయలక్ష్మిని వివరణ కోరగా ఇటీవల కురిసిన వర్షాలకు పలు రకాల పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో వరి 45 ఎకరాలు, మినుము 40 ఎకరాలు, మిరప 50 ఎక రాలు, ఉల్లి 18 ఎకరాల్లో దెబ్బతిందన్నారు. ఈ మేరకు నివేదికలు తయారు చేసి జిల్లా అధికారులకు అందజేశామని తెలిపారు.

కోతకు వచ్చిన పంట నేలపాలు



ఇటీవల కురిసిన వర్షానికి కోతకు వచ్చిన వరి నేలపాలైంది. రూ.లక్షకుపైగా పెట్టుబడితో 3 ఎకరాల్లో వరి పంట సాగుచేశాను. గాలి వానకు నేలవాలిపోయి పొలంలోనే మొలకలు వస్తున్నాయి. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

-పి.నాగ సుబ్బారెడ్డి, ఇటుకులపాడు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాలుగు ఎకరాలు మిరప (సన్నాలు) పంట సాగు చేశాను. ఇప్పటికే రూ.3.5 లక్షలు పెట్టుబడి అయ్యింది. పూత, కాయ దశలో ఉన్న పంట ఇటీవల కురిసిన వర్షానికి నీరు ఎక్కువై చెట్లు నిలువునా చనిపోతున్నాయి. దీంతో పెట్టుబడులు కోల్పోవాల్సిన పరిస్థితి. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

-బి.రమణయ్య రైతు నర్సనపల్లె.

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం



స్వర్ణోత్సవాల్లో భాగంగా ర్యాలీగా వస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు, మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ అలుగపెరగని పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ మనందరి బాధ్యత అని తెలిపారు. ఆదివారం యూటీఎఫ్ భవన్‌లో స్వర్ణోత్సవ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు స్వర్ణోత్సవాల్లో భాగంగా కడప కోటిరెడ్డిసర్కిల్ నుంచి సంధ్యాసర్కిల్ మీదుగా యూటీఎఫ్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపిం చి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. అందరికీ సమాన అవకాశాలు ఉండాలనే ఉద్దేశ్యంతో సోషలిస్టు సమాజం కోసం యూటీఎఫ్ ఏర్పాటు చేశారన్నారు. ఎన్నో లక్ష్యాలు, ఆశయాలు డిమాండ్లను సాధించుకున్నామన్నారు. హక్కుల కోసం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఎంతో పోరాటం చేశామని తెలిపారు. ప్రత్యామ్నాయ విద్యావిధానం కోసం పోరాడింది యూటీఎఫ్ మాత్రమేనని తెలిపారు. సీఐ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ యూటీఎఫ్ జిల్లాలోని అన్ని మండలాల్లో ఉండడం హర్షణీయమన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ స్థాపించడం జరిగిందని.. అప్పటి నుంచి విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు రమాదేవి, గంగిరెడ్డి, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు రవికుమార్, జేఈఈ నాయకులు షమీర్‌బాషా, యటిఎఫ్ నాయకులు నాగార్జునరెడ్డి, రవికుమార్, నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

సోంపల్లెలో ఘర్షణ.. ఆరుగురికి గాయాలు

ముద్దనూరు అక్టోబరు 20: మండల పరిధి సోంపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చేసుకోవడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలు... మండల పరిధి సోంపల్లె గ్రామానికి చెందిన మూలె నాగమునిరెడ్డి, ఎర్రంరెడ్డి రామక్రిష్టారెడ్డి కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. రెండు కుటుంబాలు కట్టెలు, రాడ్లతో ఘర్షణకు పాల్పడటంతో ఇరు కుటుంబాలకు చెందిన ఆరుగురికి రక్త గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని గాయపడిన వారిని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్మీ జవాన్ రాజేష్ అంత్యక్రియలు నేడు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్ లోని అబుజ్‌మడ్ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన బాంబు పేలి మండలంలోని పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రాజేష్ (37) అనే జవాను మృతి చెందిన విషయం తెలిసిందే.. రాజేష్ మృతదేహం ప్రస్తుతం ఆదివారం బెంగుళూరు నుంచి స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రాజేశ్ 2007 నుంచి ఐటీబీపీలో జవానుగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు జానయ్య, బాలమ్మ గ్రామంలో వ్యవసాయ కూలీల పనులు చేసుకుంటూ కుమారుడిని చదివించారు. వీరికి ముగ్గురు మగపిల్లలు. ఇరు వు రు ఆడపిల్లలు సంతానం. మృతి చెందిన రాజేశ్ నాలుగవ సంతానం. రాజేశ్‌కు భార్య, ఇరువురు కుమా రులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య పాపిరెడ్డిపల్లెలోనే ఉంటూ పిల్లలను చదివి స్తో ంది. రాజేశ్ మృతితో గ్రామంలో విషాధయలు అలుముకున్నాయి.


పిడుగు పాటుకు 18 పొట్టేళ్లు మృతి



గాలివీడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూముకుంట గ్రామం నాయునివారిపల్లెలో కొర్రు రామప్ప నాయుడుకు చెందిన 18 పొట్టేళ్లు పిడుగుపాటుకు మృతి చెందాయి. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం నాయునివారిపల్లె తూర్పు వైపున తెల్లకొండ సమీపంలోని పంట పొలాల్లో పొట్టేళ్లు మేస్తుండగా ఒక్కసారిగా ఉన్నట్లుండి పిడుగు పడటంతో 18 పొట్టేళ్లు మృతి చెందాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టేళ్ల విలువ దాదాపు 2.50 లక్షలు ఉంటుందని, తాను తీవ్రంగా నష్టపోయానని రైతు బోరున విలపించారు. పిడుగుపాటు కు తాను కూడా గాయపడ్డానని, 10 నిమిషాల పాటు మతి లేకుండా పోయిందని తెలిపారు. సంఘటన తెలిసిన వెంటనే సర్పంచ్ కుమార్‌నాయుడు, వీఆర్‌వో శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ భద్రప్పనాయుడు, టీడీపీ కదిరిరెడ్డి నాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నష్టపరిహాన్ని అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కోతికి అరటి పండు పెట్టాడని..

యువకుడికి కత్తిపోట్లు.. చికిత్స ● రేణిగుంట-మామండూరు మధ్య ఘటన


రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీల్‌కుమార్

రైల్వేకోడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైలులో ఓ వ్యక్తి దగ్గర ఉన్న కోతికి అరటి పండు పెట్టాడని కోతి నిర్వాహకుడు యువకుడిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆదివారం తిరుపతి జిల్లా రేణిగుంట-మామండూరు మధ్యలో జరిగింది. గాయపడిన వ్యక్తికి రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేశారు. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం ఉదయం ఓబులవారిపల్లె మండల పరిధిలో ఉన్న బొంతవారిపల్లె దళితవాడకు చెందిన జవ్వాది లక్ష్మయ్య, రేవూరి సునీల్‌కుమార్, పండుగోల శేఖర్ తదితరులు మద్యం ఎక్కువగా తాగేవారు. వీళ్లు రేణిగుంట మండల పరిధిలోని కరకంబాడి గ్రామ సమీపంలో ఉన్న కట్టాపుట్టాలమ్మ దేవస్థానం వద్దకు వెళ్లి మద్యం తాగకుండా దేవుడి వద్ద ప్రమాణం చేసి పూజలు నిర్వహించి.. రైల్వేకోడూరుకు వచ్చేందుకు నంద్యాలకు వెళ్లే రైలును ఎక్కడానికి రేణిగుంటకు వెళ్లారు. అక్కడ రైలు ఎక్కగానే ఒక వ్యక్తి కోతిని పట్టుకుని ఉండటాన్ని సునీల్‌కుమార్ గుర్తించాడు. తన దగ్గర ఉన్న స్వామి ప్రసాదం అయిన అరటి పండును తీసుకుని కోతికి పెట్టడంతో ఉన్నఫళంగా కోతి నిర్వాహకుడు సునీల్‌కుమార్‌పైకి గొడవకు దిగాడు. ఇరువురి మధ్య మాటమాట పెరిగింది. కోతి పట్టుకుని ఉన్న వ్యక్తి తన దగ్గర ఉన్న చిన్నపాటి కత్తితో సునీల్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో సునీల్‌కుమార్ తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం పక్క బోగీలో ఉన్న సునీల్‌కుమార్ బంధువులకు తెలిసి వారు రావడంతో బాలపల్లె రైల్వేస్టేషన్‌లో కోతిని పట్టుకున్న వ్యక్తి దిగి పరారయ్యాడు. గాయపడిన సునీల్‌కుమార్‌ను రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. సమాచారం తెలిసిన స్థానిక పోలీసులు విచారించారు. సంఘటన తమ పరిధిలోకి రాదని తెలపడంతో విచారణ చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ రవి తెలిపారు.

మందలించాడని..

● కళాశాల ఇన్‌ఛార్జిపై కత్తితో దాడి చేసిన విద్యార్థి

● పోలీసుల అదుపులో బాలుడు.. కేసు నమోదు


గాయపడిన వెంకటరమణ

తిరుచానూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భోజనం చేస్తున్న సమయంలో మందలించారని.. తన ప్రవర్తన తీరుపై తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారని ఆగ్రహించిన విద్యార్థి.. క్షణికావేశంతో కళాశాల ఇన్‌చార్జిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా సోమల మండలం అడుసుపల్లికి చెందిన వెంకటరమణ తిరుపతిలోని ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో క్యాంపస్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. ఆయన తిరుచానూరులోని బ్రాంచిలో ఉన్నారు. పీలేరుకు చెందిన ఇంటర్ విద్యార్థి.. దసరా సెలవులకు వెళ్లి ఆదివారం రాత్రి క్యాంపస్‌కు వచ్చాడు. రాగానే కళాశాలలో పనిచేసే ఉద్యోగి వెంకటరమణ ఫీజు అడగారు. సమాధానం లేకపోవడంతో అక్కడ కూర్చోబెట్టారు. అదే సమయంలో అతడి తల్లిదండ్రులకు ఫోను చేయగా వారి నుంచి సమాధానం లేదు. అంతకుముందే ఆ విద్యార్థిపైన కళాశాలలోని వారు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయడంతో వారు తీవ్రస్థాయిలో అతడిని మందలించారు. దీంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఆ విద్యార్థి.. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఆదివారం రాత్రి కళాశాలకు రావడం.. ఫీజు విషయమై ప్రశ్నించారు. అప్పటికే తనపై తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారని, తాను భోజనం చేసే సమయంలో అందరి ముందు అసభ్యంగా మాట్లాడారని ఉద్యోగి రమణపై కోపం పెంచుకున్న విద్యార్థి.. బ్యాగులోని కత్తి తీసి దాడి చేశాడు. కళాశాల యాజమాన్యం విద్యార్థిని తిరుచానూరు పోలీసులకు అప్పగించి, గాయపడిన వెంకటరమణను రుయాకు తరలించారు. అతడికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. దాడికి పాల్పడిన విద్యార్థిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. క్షణికావేశంలో తాను దాడికి పాల్పడినట్లు విద్యార్థి పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.

నిందితుల కోసం కొనసాగుతున్న వేట

కడప క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై కర్రలతో దాడి చేసిన నిందితుల కోసం పోలీసు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం అప్సర నుంచి ఇంటికి వెళుతున్న క్రమంలో ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తుంది. దాడి చేసిన వారిలో ఒకరిని గుర్తించి.. అతన్ని పట్టుకునేందుకు వేట సాగిస్తున్నారు. అయితే దాడికి గల కారణం సొంత పార్టీ వర్గమా లేక ఇతరులు ఎవరైనా దాడి చేశారా అన్న విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

వాల్టా..ఉల్టా..!

● మామూళ్లు ఇస్తే రైట్.. ● రాత్రి, పగలూ తేడా లేదు..
● యథేచ్ఛగా కలప అక్రమ రవాణా ● చోద్యం చూస్తున్న అటవీ శాఖ అధికారులు



వాల్మీకిపురం గుండా మదనపల్లెకు ట్రాక్టర్లలో కలప అక్రమ రవాణా

వాల్మీకిపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నియమనిబంధనలు తుంగలో.. వాల్టా చట్టం ఉల్లంఘన వెరసి కలప అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించు కునేనాథుడే కరువయ్యారు. వాల్మీకిపురం నుంచి మదనపల్లెకు కలపను అక్రమ మా ర్గంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా తరలించుకుపోతుండటం గమనార్హం. స్థానిక బైపాస్ రోడ్డులో రహదారి పక్కగా అటవీ శాఖ కార్యాలయం ఉండగా కలప అక్ర మ రవాణా జోరుగా సాగుతున్నా ఓల్టా చట్టం ఉల్లంఘిస్తున్నా దీనిపై ఏనాడూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని సర్వత్రా విమర్శలున్నాయి. అయితే అట వీ అధికారులే మామూళ్లకు అలవాటు పడి కలప అక్రమ రవాణాకు సహకరిస్తు న్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. స్థానికంగా టింబర్ యజమానులు కలప అక్రమ రవాణాలో అదనుగా ఎర్రచందనం దుంగలు రహస్య మార్గంలో తీసుకెళ్తున్నట్లు సమాచా రం. వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల నుంచి ప్రభుత్వ భూములలోని చెట్లను అక్ర మంగా నరికివేస్తున్నా సంబంధిత అధికారుల చర్యలు మాత్రం అంతంతంగా ఉన్నాయనడా నికి ఈ అక్రమ రవాణా కార్యకలాపాలే ప్రత్య క్ష నిదర్శనం. అటవీ శాఖ అధికారులు సైతం అక్రమార్కులకు సహకరిస్తున్నట్లు చర్చాంచనీ యంగా మారింది. ప్రతి రోజు వాల్మీకిపురం నుంచి మదనపల్లెకు సుమారు పది ట్రాక్టర్లు పైగా ఓవర్‌లోడుతో కానుగ, వేప, నీలగిరి తదితర కలప అక్రమంగా తరలించుకుపో తున్నారు. మరి కొన్ని ప్రాంతాలలో చెరువులలోని కలప ను సైతం చెరబట్టి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటూ గ్రామస్థులు అడ్డుపడిన సమ యాలలో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సం బంధిత అధికారులు కలప అక్రమ రవా ణా ను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వాల్మీకిపురం నుంచి పట్టపగలే కలప అక్రమ రవాణా

అక్రమ రవాణాపై నిఘా పెట్టాం..

వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా కలప అక్ర మ రవాణాపై గట్టి నిఘాపెట్టి ఎప్పటికప్పుడు పర్య వేక్షిస్తు న్నాం. అనుమతులు లేకుండా చెట్లు నరికివేతకు పాల్పడి నా, కలప అక్రమ రవాణా చేసినా చట్టరీత్యా ఖచ్చి తమైన చర్యలు తీసుకుంటాం. ఇకపై అక్రమ రవాణా జరుగ కుండా నిఘా చర్యలు ఉంటాయి. టింబర్ వ్యాపారులు నిబంధన లు పాటించాలి. అటవీ సిబ్బంది కూడా బాధ్యతగా విధు లు నిర్వర్తించాలి. సిబ్బందిపై ఎలాంటి అవినీతి ఆరోప ణలు వచ్చినా తగు చర్యలు ఉంటాయి.

- సుధాకర్, అటవీశాఖ అధికారి, వాల్మీకిపురం



ఆలస్యంగా రైళ్లు..అవస్థల్లో ప్రయాణికులు

ములకలచెరువు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి గుంతకల్లు జంక్షన్‌కు ములకలచెరువు మీదుగా నడిచే రైళ్లు శనివారం ఆలస్యంగా నడి చాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుపతి నుంచి గుంతకల్లు జంక్షన్‌కు రాత్రి నడిచే ప్యాసెంజర్ రైలు(ప్రత్యేక చార్జీల రైలు) ములకలచెరువుకు తెల్లవారుజామున 1.49 గంటలకు రావాల్సి ఉండగా 3.50 గంటలకు వచ్చింది. అలాగే నరసాపురం నుంచి ధర్మవరం జంక్షన్‌కు నడిచే ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు ములకలచెరువుకు ఉదయం 6.49 గంట లకు రావాల్సి ఉండగా ఉదయం 8.28గంటలకు వచ్చింది. రెండు రైళ్ళు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణం పడమర ధర్మపథం శ్రీకార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూ దేవాలయంలో కృత్తికా నక్షత్రం సందర్భంగా ఆదివారం సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా కమనీయంగా నిర్వహించారు. షిరిడీ సాయి సాలిగ్రామ తిరునా రాయణ ధార్మిక సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ ఉత్సవంలో భాగంగా భక్తుల కు తీర్థ, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం స్వాధీనం

కురబలకోట, అక్టోబరు 20: మండలంలోని అంగళ్ళు పం చాయతీ పరిధిలో ఆక్రమణ కు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు ఆది వారం స్వాధీనం చేసుకు న్నారు. అంగళ్ళు పంచా యతీ పరిధిలోని సర్వేనం బర్ 118లో గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల అండదండలతో ఇష్టానుసా రంగా ఆక్రమించుకుని పలువురు నిర్మాణాలు చేపట్టారు. దాదాపుగా 20సెం ట్ల భూమి ఆక్రమణకు గురైంది. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం రావడంతో ఆక్రమణకు గురైన భూమిలో ప్రభుత్వానికి చెందిన భూమిగా నిర్ధారిస్తూ రెవెన్యూ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా విద్యుత్తు పనులు

● ఇనుప స్తంభాల స్థానంలో సిమెంటు పోల్స్

మదనపల్లె, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో వివిధ ప్రాంతాల్లో అయిదు దశాబ్దాల క్రితం నాటిన ఇనుప విద్యుత్తు స్తంభాల స్థానంలో కొత్త పోల్స్ ఏర్పా టు చేస్తున్నారు. మదనపల్లె పంచాయతీగా ఉన్న సమ యంలో పాత మదనపల్లెలోని కొన్ని ప్రాంతాల్లో తొమ్మిది మీటర్లు గల ఇనుప విద్యుత్తుస్తంభాల ఆధారంగా వైర్లు లాగారు. ప్రస్తుతం తుప్పు పట్టిపోవడం, వర్షాకాలంలో విద్యుత్తు సరఫరా రావడం, నివాసాలకు విద్యుత్తు కనెక్షన్లు ఎక్కువ కావడంతో వైర్లు ఇబ్బడిముడిగా ఉండిపోయాయి. పైగా లైన్లు ఎక్కువగా నివాసాలను ఆనుకుని ఉండటంతో తరచూ విద్యుత్తు ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రాం త ప్రజలు ఇప్పటికే ప్రజాప్రతినిధులు, ఆశాఖ అధికా రుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా..ప్రజాసమస్యలపై వార్డుల వారీగా పర్యటన చేపట్టారు. ఇందులోభాగంగా స్థానికు లు విద్యుత్తు స్థంభాలు తొలగించి వాటి స్థానంలో కొత్త వి ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ నేపథ్యంలో వాటిని పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులను ఎమ్మె ల్యే ఆదేశించడంతో డీఈ గంగాధర్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో అధికారులు అంచనాలు రూపొందించి పనులు చేపట్టా రు. ఇందులోభాగంగా దేవళంవీధి, నెహ్రూవీధి, త్యాగరా జవీధి, దక్నీపేట, సిపాయివీధి, రాఘవేంద్రస్వామిగుడి వీధి, తదితర ప్రాంతాల్లో ఇనుప స్థంభాలు ఉండగా, మొదటి విడతగా దేవళంవీధి, నెహ్రూవీధిలలో రెండు రోజులుగా పనులు చేపడుతున్నారు.



దేవళంవీధి సందులో ఇనుప స్థంభం స్థానంలో కొత్త పోలు ఏర్పాటు చేస్తున్న విద్యుత్తుశాఖ అధికారులు

ఆధార్ కోసం తిప్పలు...ఇబ్బందుల్లో ప్రజలు

గుర్రంకొండ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : గుర్రంకొండలో ఆధార్ కేంద్రం పని చేయకపోవడంతో గ్రామీణ జనం పడు తున్న కష్టాలు వర్ణనాతీతం. ఆధార్ కార్డు కావాలన్నా.. తప్పు ఒప్పులు సరిచేసుకోవాలన్నా ప్రజలు కిలో మీటర్లు దూరం వెళ్లాల్సి వస్తోంది. గుర్రంకొండ మండలంలో 15 పంచాయతీలు, 175 గ్రామాలున్నాయి. గతంలో ప్రజల సౌకర్యం కోసం గుర్రంకొండ, చెర్లోపల్లె, మర్రిపాడు సచివాలయాల్లోని గ్రామాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో మండల ప్రజలతో పాటు పక్క మండలాల వారికి అనువుగా ఉండేది. అయితే గుర్రంకొండ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం కొన్ని నెలలుగా పని చేయడం లేదు. ఈ కేంద్రంలో ఆధార్ కోసం ఇచ్చిన కంప్యూటర్లు పరికరాలు పని చేయకపోవడంతో సమస్య ఏర్పడింది. దీంతో ఆధార్ కోసం ప్రజలు వాల్మీకిపురం, మదనపల్లి, కలకడ మండలాలకు వెళ్లాల్సివస్తోంది. అంతేకాకుండా ఆధార్ కోసం టి.పసలవాండ్లపల్లి, ఎల్లుట్ల, నడిమిఖండ్రిగ, అమిలేపల్లె, తరిగొండ, రామాపురం, శెట్టివారిపల్లి, సంగసముద్రం ప్రజలు ఆధార్ మార్పు, చేర్పులకు కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ప్రజల సౌకార్యార్థం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై గుర్రంకొండ పంచాయతీ ఈవో హరిని వివరణ కోరగా ఆధార్ కేంద్రంలో సాంకేతిక కారణాలతో పని చేయడం లేదన్నారు. ఆధార్ కేంద్రం పని చేయడానికి కావాల్సిన పరికరాలను జిల్లా అధికారుల నుంచి తెప్పించుకున్ని సమస్యను పరిష్కరిస్తామన్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో ఏర్పాటు చేసిన రెండు ఆధార్ కేంద్రాలలో ఆధార్ సేవలు ఆగిపోయా యి. మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు, పేర్లు చేర్పులు, మార్పులు సౌక ర్యం ఏర్పాటు చేశారు. గత సంవత్సర కాలంగా ఆధార్ సేవలు ఆగినట్లు ప్రజలు వాపోతున్నారు. పెద్దమండ్యం గ్రామ పంచాయతీ ఆధార్ నమోదు సమయంలో ఐరిష్ పరికం కిందపడి పగిలి మరమ్మత్తులకు గురైంది. కలిచెర్ల ఆధార్ కేంద్రంలో ఇదే పరిస్థితి. ఈ చిన్న చిన్న సమస్యలు ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. ఆధార్ నమోదు, పేర్లు చేర్పులు మార్పులు, ఆధార్ కార్డు నమోదు కోసం ఇతరు ప్రాంతాలతో పాటు పెద్దమండ్యం గ్రామీణ బ్యాంక్ అను సంధానంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలలో బాధితులు ఆశ్రయిస్తున్నారు. ఐరిష్ పరికరం త్వరలో ఏర్పాటు చేసి పెద్దమండ్యంలో ఆధార్ సేవలు ప్రారంభిస్తామని ఎంపీడీవో తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



రామసముద్రం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూ ల్‌లో ఆదివారం 1987-88 విద్యా సంవత్సరానికి చెందిన పదోతరగతి పూర్వ విద్యా ర్థు ల సమ్మేళనం జరిగింది. అప్ప టి గురువులైన ఆంగ్ల ఉపా ధ్యాయులు వరలక్ష్మి హిందీ ఉపాధ్యాయులు అనం త శేష వేణుగోపాలచారి, గణిత ఉపాధ్యాయులు సుబ్ర హ్మణ్యం, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణవేణిలకు విద్యార్థులు పూలమాలలు వేసి, శాలువలు కప్పి జ్ఞాపిక లను అందించి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 35సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులను కలవడం సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి మధుర జ్ఞాపకా లను నెమరువేసుకున్నారు. అనంతరం అందరూ కలసి సహబంతి భోజనాలు చేశారు.

కన్నుల పండువగా గంధోత్సవం



గంధాన్ని తీసుకెళ్తున్న మత గురువులు

ములకలచెరువు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీమహ ల్ వద్ద వెలసిన హజరత్ మహబూబె సుబహానీ ఉరుసు ఉత్స వాల్లో భాగంగా శనివారం రాత్రి జరిగిన గంధోత్సవం కన్నుల పండువగా జరిగింది. బాణాసంచా పేలుళ్ళు, ఫకీరుల విన్యా సాల నడుమ గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొచ్చా రు. మత గురువులు మహమ్మద్ ముఖ్తార్‌షా గంధాన్ని సమ ర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అలాగే అన్నదాన కార్యక్ర మం జరిగింది. ఈ కార్యక్రమాల్లో దర్గా కమిటీ అధ్యక్షుడు అగ్రహా రం కాలేషా, కమిటీ సభ్యులు సునీల్‌బాషా, జహీర్, ఆటో రఫీ, మెకానిక్ మస్తాన్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం వస్తే.. చిత్తడే... చిత్తడి

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉన్న రహదారులు కొద్ది పాటి వర్షం కురిస్తే చిత్తడి చిత్తడిగా మారుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు కల్పించక పోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రంగసముద్రం గ్రామం లోని విసనకర్రవాండ్లపల్లె దిగువ వైపున ఉన్న జెండా మాను దగ్గర ఉన్న ప్రధాన రహదారి సిమెంట్ రోడ్డు లేక పోవడంతో కొద్ది పాటి వర్షం వస్తే ప్రధాన వీదిలో పాదచారులు సైతం నడవాలంటే ఇబ్బంది కరంగా ఉం ది. వర్షా కాలం వచ్చిందంటే ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోం దని గ్రామస్థులు వాపోతున్నారు. కనీసం ఇప్పటికైనా సంబందిత అధికారులు చర్యలు తీసుకుని చిత్తడి వీధికి సిమెంట్ రోడ్డును మంజూరు చేయాలని గ్రామస్థులు ఈ సందర్భంగా కోరుతున్నారు.



టీడీపీలో చేరిన రాచవేటివారిపల్లి వైసీపీ సర్పంచ్

●అభివృద్ధి పథకాల అమలుతో టీడీపీలో చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్న సర్పంచ్ సుబ్రమణ్యం, వార్డు సభ్యులు

నిమ్మనపల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచవేటివారిపల్లి వైసీపీ సర్పంచ్ సుబ్రమణ్యం(మధు)తో పాటు వార్డు సభ్యులు ఆదివారం జరిగిన పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా స్థాని క ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా రాచ వేటివారిపల్లి సర్పంచ్ సుబ్రమణ్యం మా ట్లాడుతూ తాను సర్పంచ్‌గా ఉన్నప్పటి నుంచి గ్రామంలో ఒక్క అభివృద్ధి పని చేయలేదని టీడీపీ అధికారంలోకి రాగానే పంచాయతీ అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. ప్రజలకు మంచి చేయాలని ఉద్దేశ్యంతో వైసీపీ వీడి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. అనం తరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సుబ్రమణ్యం, వార్డు సభ్యులు చక్రపాణిరెడ్డి, షమీల, చంద్రారెడ్డి, షరీఫ్‌లకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

రూ.1.5కోట్లతో సీసీ రోడ్లకు భూమిపూజ

నిమ్మనపల్లి మండలంలోని పది పంచాయతీల్లో ఉపాధి హామీ కింద మంజూరైన రూ.1.5 కోట్లతో సీసీ రోడ్ల పనులకు పల్లెపండుగ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భూమి పూజ చేశారు. మొత్తం 40సీసీరోడ్లకు గాను రూ.1.5కోట్లలను ప్రభుత్వం కేయించిదన్నారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు సుధాకర్‌రావు, మల్లికార్జున, రెడ్డెప్పరెడ్డి చంద్రశేఖర్, ఆర్జే వెంకటేష్ మహ మ్మద్ రఫి, రాజన్న, ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, పీఆర్ డీఈ శివశంకర్ పాల్గొన్నారు.

కురవంక ఆక్రమణలపై కలెక్టర్ సీరియస్

● ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సంయుక్త సర్వే
● నాలుగు చోట్ల ఆక్రమణల గుర్తింపు



కురవంక ఆక్రమణలపై సర్వే చేస్తున్న జలవనరులశాఖ, రెవెన్యూశాఖ అధికారులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్ట ణంతో పాటు, శివారులోని కుర వంక గ్రామ పంచాయతీలో ప్రవ హిస్తున్న కురవం క ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సీరియస్ అయ్యారు. దీనిపై వెంట నే సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన సంబంధిత అధికారుల ను ఆదేశించారు. గత నెల 19వ తేదిన 'కుచించుకుపోయిన కురవంక' శీర్షికన కథనం ప్రచురితమైన విష యం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి అందిన ఫిర్యాదులతో కురవంక ఆక్రమణలపై సమగ్ర విచారణ చేయించి నివేదికలు పంపాలని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వ రూప్‌కు ఈనెల 14న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సబ్‌కలెక్టర్ ఉత్తర్వుల మేరకు జల వనరులశాఖ, రెవెన్యూ అధికారులు మూడు రోజులుగా కురవంక ఆక్రమణలపై సర్వే నిర్వ హించారు. ఇందులో భాగంగా ఆదివారం పట్టణ శివారులోని కురవంక ఆంజనేయస్వామి ఆల యం నుంచి అధికారులు సంయుక్త సర్వే ప్రారంభించారు. రికార్డుల ప్రకారం కురవంక వెడల్పు ఉన్న నాలుగు చోట్ల పలువురు ఆక్రమించుకోవడంతో పాటు ఇళ్లను నిర్మించడంతో వంక కుచించు కుపోయింది. గట్టిగా వర్షాలు పడి వరదలు వస్తే ఈ ఇళ్లన్నీ వరదనీటిలో మునిగిపోనున్నాయి. అలాగే కురవంక ప్రవహించే దిగువ కురవంక, ప్రశాంతనగర్, ఇందిరా నగర్ ప్రాంతాల్లో కూడా జలవనరులశాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించనున్నట్లు సమాచారం. ఇదే జరిగితే పట్టణంలో సుమారు 48 చోట్ల కురవంక ఆక్రమణలకు గురైన చోట్ల అధికారులు మార్కిం గ్ చేయనున్నారు. ఈ సందర్భంగా కురవంక సచివాలయ సర్వేయర్ యశోధ, జలవనరులశాఖ ఏఈ రాయలబాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కురవంక నాలుగు చోట్ల ఆక్రమణలకు గురైందని మార్కింగ్ చేయడంతో పాటు నివేదికలకు ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

కొత్తచెరువులో ఆక్రమణలు తొలగింపు



చెరువులో ఏర్పాటు చేసిన రాళ్లను తొలగిస్తున్న అధికారులు

కురబలకోట, అక్టోబరు 20: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆపార్టీ నేతలు దౌర్జ న్యాలకు పాల్పడి చెరువును ఆక్రమించు కున్న భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకు న్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కంటేవారి పల్లె సమీపంలో కొత్త చెరువులో ఆక్రమణ శీర్షిక కథనం ప్రచు రితమైంది. దీనిపై స్పం దించిన అధికారు లు విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్‌కు నివేది కను అందజేశారు. దీనికి సంబంధించిన నివేదికను పరిశీలించి భూమి స్వాధీనం చేసుకోవాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశించ డంతో రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని ఆక్రమణకు గురైన భూమిలో ఏర్పాటు చేసిన రాళ్ల కంచెను తొలగించారు.

రంగనాథగుప్త సేవలు చిరస్మరణీయం



అనాథాశ్రమంలో చిన్నారులకు అన్నదానం చేస్తున్న ఎన్.కృష్ణారెడ్డి

మదనపల్లె టౌన్, అక్టోబరు 20(ఆంధ్ర జ్యోతి): ఉపాధ్యాయుడుగా రంగనాథ గుప్త అందించిన సేవలు చిరస్మరణీ యమని కృష్ణారెడ్డి సిద్దార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.కృష్ణారెడ్డి పేర్కొ న్నారు. ఆదివారం స్థానిక దేవాతనగర్ లోని చైతన్య ఆనంద్ వృద్ధాశ్రమంలో దివంగత రంగనాథగుప్తా జ్ఞాపకార్థం వృద్ధులకు, అనాథ పిల్లలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రంగనాథగుప్త తమ విద్యాసంస్థలకు గౌరవ సలహాదారుడుగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. అనంతరం చైతన్య అనాథాశ్రమానికి 100 కిలోల బియ్యంతో పాటు, 50 స్టీలు ప్లేట్ల ను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివా సులురెడ్డి, అనాథాశ్రమం నిర్వాహకులు కవితారాణి, గిరిజమ్మాల్, వృద్ధులు, చిన్నారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పార్థసారథి

మదనపల్లె అర్బన్, అక్టోబరు20: కేం ద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే పార్థ సారథి తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణా కళ్యాణమండంలో నిర్వహిస్తు న్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్ర మంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆ యన మాట్లాడుతూ ప్రతి ని యోజక వర్గంలో సభ్యత్వ నమోదు ను పూర్తి చేయాలన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజంపేట జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి, వీరాంజనేయ ప్రసాద్, మదనపల్లె పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, మదనపల్లె రూరల్ అధ్యక్షుడు వసంతకుమార్, నారథరెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకి సంఘ అధ్యక్షుడిగా విష్ణుచైతన్య



వాల్మీకిపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల వాల్మీకి సంఘ అధ్యక్షుడి గా విష్ణుచైతన్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాల్మీకి సంఘ పెద్దల సమక్షం లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షు డిగా విష్ణుచైతన్య, ఉపాధ్యక్షులుగా రంజిత్‌కుమార్, రాజగోపాల్, కార్యదర్శిగా భరత్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా రమేష్, సభ్యు లుగా లక్ష్మీదేవి, రెడ్డిప్రసాద్, సాంబశివ, భాస్కర్, రామచంద్ర, రాజేష్‌కుమార్, రామకృష్ణ ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షులు విష్ణుచైతన్య మాట్లాడుతూ వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వాల్మీకి సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయస్థాయి సదస్సులో మిట్స్ విద్యార్థి ప్రతిభ

కురబలకోట, అక్టోబరు 20: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి అంత ర్జాతీయస్థాయి సదస్సులో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశా లలో ఈసీఈ తృతీయసంవత్సరానికి చెందిన విద్యార్థి మోక్షిత్ దుబాయ్‌లో జరిగిన ఐఈఈఈ కమ్యూనికేషన్ సొసైటీ స్టూడెంట్ టెక్ లీడర్‌షిష్ సమ్మిట్‌లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా పలు వురు ప్రొఫెసర్‌లు ఆయనను అభినందించి ప్రశంసాపత్రాలన్ని అందజేశారు. ఈసదస్సుకు వివిధ దేశాల నుంచి సుమారు 300మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థిని కరస్పాండెంట్ ఎన్.విజ యభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ తదితరులు అభినందించారు.